# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం, 11 ఏప్రిల్-2026 balagamtv100@gmail.com పేజీలు-8


## నేడు లేదా రేపు ఇంటర్ ఫలితాలు



## లెబనాన్‌లపై దాడుల్లో పౌరుల మృతిపై భారత్ ఆందోళన



- దేశ ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం
- గల్ఫ్ దేశాలతో చర్చలకు కేంద్రమంత్రులు
- విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 : దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని విదేశ్రాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ మేరకు ఖతార్‌తో ఒప్పందం చేసుకొనేందుకు చర్చలు కొనసాగుతున్నాయన్నారు. అదే సమయంలో పొరుగు దేశాల ఇంధన అవసరాలనూ తీర్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండు వారాల క్రితం భారత్.. శ్రీలంకకు 38 మెట్రిక్ టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను సరఫరా చేసినట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు దేశ ఇంధన భద్రతను పటిష్టం చేసేందుకు మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని చెప్పారు. విదేశాంగ మంత్రి ప్రస్తుతం మారిషస్‌లో ఉన్నారని, అక్కడి నుంచి 11,12 తేదీల్లో యూఏఈలో పర్యటిస్తారని తెలిపారు. భారత్-యూఏఈ సంబంధాల బలోపేతంపై అక్కడి నాయకులతో చర్చిస్తారని అన్నారు. పెట్రోలియం మంత్రి సైతం ప్రస్తుతం ఖతార్‌లో పర్యటిస్తున్నట్టు చెప్పారు. భారత్‌కు నమ్మకమైన ఇంధన సరఫరాదారుగా ఉన్న ఖతార్ సైతం భారత్‌తో ఇందన సహకారానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపిందని వివరించారు. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ సముద్ర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకుని రావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో ఎల్‌పీజీ, పెట్రోల్ ఇతర ఇంధన నిల్వలకు ఎటువంటి కొరతా లేదని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ పేర్కొన్నారు. పెట్రోల్ బంకులలో తగినంత నిల్వలు ఉన్నాయని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా సాధారణంగానే మిగతా 3లో..

## రాష్ట్రపతి, ప్రధానులతో గవర్నర్ భేటీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 : తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి, ప్రధానులను కలుసుకున్నారు. తెలంగాణ గవర్నర్‌గా నియమితులు అయ్యాక ఆయన తొలిసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మును కలసారు. తనను గవర్నర్‌గా నియమించి పనచేసే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రధాని మోడీతో కూడా ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోడీ గవర్నర్‌కు అభినందనలు తెలిపారు.

## అన్నా.. నన్ను దేవుడే పంపిండు...

- మీతో కలిసి పని చేయమని చెప్పిండు
- ఎర్రవల్లిలో కెసిఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ
- ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పలకించిన కెసిఆర్



గజ్వేల్,ఏప్రిల్10 : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. ’ అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని’ అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు. తాజా రాజకీయాలు, కాంగ్రెస్ తీరును ఆయన కెసిఆర్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.’ తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన మిగతా 3లో..



## రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం





న్యూఢిల్లీ,ఏప్రిల్10 : బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్ కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.

## డీజీపీ ఎదుట మరో 42 మంది మావోయిస్టులు లొంగుబాటు



- డిజిపి ఎదుట లొంగిపోయిన కేశాలు
- మొత్తం 42 మంది ఆయుధాలతో లొంగుబాటు
- వారికి పునరావాసం కల్పిస్తామన్న శివధర్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్10:తెలంగాణ పోలీ సుల ఎదుట మావోయిస్టు అగ్రనేత, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ డిప్యూటీ కమాండర్ సోడిమల్ల కేశాలు లొంగిపోయారు. అతనితో పాటు మొత్తం 42 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల నుంచి వచ్చి వీరంతా లొంగిపోయారు. ములుగు, భూపాల పల్లి మీదుగా పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోతున్నట్లు ప్రకటించారు. అనంతరం సరిహద్దుల నుంచి పోలీసులు వీరిని వాహనాల్లో మిగతా 3లో..

## కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

- ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో
- గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది కదా
- కేవలం కమిషన్ల కోసమేనేమో అన్న అనుమానాలు
- రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ జపం
- జిహెచ్ఎంసిలో తీవ్ర అవినీతి జరుగుతోంది
- సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్,ఏప్రిల్10 : కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ ని ర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ..కమిషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు మిగతా 3లో..

## మరోమారు షాకిచ్చిన పసిడి ధర

ఏకంగా రూ.1,520 పెరుగుదల



## కాలిన నోట్ల కట్టల వ్యవహారం

- ప్రదవికి రాజీనామా చేసిన జస్టిస్ యశ్వంత్ వర్మ

2లో..

## తదుపరి డిజిపిగా సివి ఆనంద్ ?



- ప్రభుత్వ పరిశీలనలో ఆయన పేరు

హైదరాబాద్, ఏప్రిల్ 10: తెలంగాణ రాష్ట్రానికి కొత్త పోలీస్ బాస్ నియామక పక్రియ తుది దశకు చేరుకుంది. 1991వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సి.వి. ఆనంద్ తెలంగాణ రాష్ట్ర తదుపరి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఇన్-చార్జ్ డీజీపీగా కొనసాగుతున్న బి. శివధర్ రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండటంతో, ఆ స్థానంలో శాశ్వత ప్రాతిపదికన కొత్త అధికారిని నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నియామకం కోసం రాష్ట్రం పంపిన ఐదుగురు అధికారుల జాబితాను పరిశీలించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , ముగ్గురు అధికారులతో కూడిన ప్యానెల్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఆ జాబితాలో సి.వి. ఆనంద్‌తో పాటు కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్‌గా ఉన్న వినాయక ప్రభాకర్ ఆప్టే , తెలంగాణ జైళ్ల శాఖ డీజీగా ఉన్న సౌమ్య మిశ్రాల పేర్లు ఉన్నాయి. అయితే, ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పేరు ఈ సిఫార్సు జాబితాలో లేకపోవడంతో ఆయన పదవీ విరమణ అనివార్యం కాగా, సీనియారిటీ , మిగతా 3లో..

## ‘హర్మూజ్’ నిర్వహణపై మొజ్తాబా కీలక ప్రకటన..

- కొత్త దశకు తీసుకెళ్తామని వ్యాఖ్య..!



న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 : హర్మూజ్ జలసంధి నిర్వహణపై ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ కీలక ప్రకటన చేశారు. జలసంధి నిర్వహ ణను కొత్త దశకు తీసుకెళ్తామని ఆయన ప్రకటించారు. ఈ దశలో హర్మూజ్‌పై అనుసరించే విధానం మరింత వ్యూహాత్మకంగా, కఠినంగా ఉంటుందని సంకేతాలు ఇచ్చారు. ఈ మేరకు ఆయన చేసిన ప్రకటనను ఇరాన్ మీడి యా చదివి వినిపించింది.అమెరికా- ఇరాన్ దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన ప్పటికీ.. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్‌లో పరిస్థితులు ఇంకా కుదుటపడలేదు. ఈ క్రమంలో జలసంధిని కొత్త దశకు తీసుకెళ్తామని మొజ్తాబా ప్రకటించడం కీలక పరిణామంగా మారింది. ఇక ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని సుప్రీంనేత స్పష్టంచేశారు. కానీ ఎట్టిపరిస్థితుల్లో తమ హక్కులను వదులుకోమని వ్యాఖ్యా నించారు. దాడుల్లో తన తండ్రి అయతుల్లా అలీ ఖమేనీ సహా అనేకమంది కీలక నేతల మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని ఇరాన్ దృఢ నిశ్చయంతో ఉందన్నారు.యుద్ధంలో మిగతా 3లో..

## ఎదల ప్రభుత్వంపై ప్రతిపక్షాల బురద రాజకీయం

- వారికంటిన బురదను మాకు అంటించే ప్రయత్నం
- సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం,ఏప్రిల్10 : ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీకీ, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని ఎవరు ఎన్ని కారుకూతలు కూసినా భవిష్యత్తు లో ఇందిరమ్మ ప్రభుత్వంని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో 1.52 కోట్లతో నిర్మించిన ప్యాక్స్ గోదాములను ప్రారంభించారు. అలాగే మండలంలో 191 మంది లబ్దిదారులకు మిగతా 3లో..

## ఐటి కారిడార్‌లో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి పోలీస్ల ఔట్‌పోస్టును ఢీకొన్న కారు
- కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలు




హైదరాబాద్, ఏప్రిల్ 10: హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మసీద్ బండ నుంచి కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఓ కారు అదుపు తప్పి ట్రాఫిక్ అవుట్ పోస్టును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం కూడా తీవ్రంగా దెబ్బతింది. కారు ఇంజిన్ భాగం లోపలికి చొచ్చుకు పోయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలిం చారు. ప్రస్తుతం వారికి ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది. సమా చారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. మితి మీరిన వేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. రక్త నమూనాలను సేకరించి పరీక్ష లకు పంపే అవకాశం ఉంది. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. సీసీటీవీ ఫుటేజీని కూడా పరిశీలిస్తున్నారు. ఐటీ కారిడార్ పరిధిలో అర్ధరాత్రి వేళల్లో రోడ్లు ఖాళీగా ఉన్నాయని అతివేగంగా వెళ్లడం ప్రమాదాలకు దారితీ స్తోందని పోలీసులు తెలిపారు. గచ్చిబౌలి, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో పోలీసులుఎన్ని తనిఖీలు చేస్తున్నా ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంఆందోళనకలిగిస్తోందన్నారు. వేగం కంటే ప్రాణం ముఖ్యమని,మద్యంసేవించివాహనాలునడపవద్దనిపోలీసులు సూచించారు.

## అధ్వాన్నంగా ప్రభుత్వ పాఠశాలలు

### రోజుకో బిడ్డ చనిపోతున్నా చలనం లేదు

### కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్ఎస్‌పి విమర్శలు



హైదరాబాద్, ఏప్రిల్ 10: అసమర్థ కాంగ్రెస్ పాలనలో తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి వారం ఒక బిడ్డ చనిపోతుందని బీఆర్ఎస్ నాయకుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ప్రజల ఉసురు తీసుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి వారం ఒక ఆటో డ్రైవర్, ఆరుగురు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. ప్రతి వారం 17 పాఠశాలలు మూత పడుతున్నాయి. కానీ ప్రతిరోజూ కాంగ్రెస్ పాలకులు రూ.25 కోట్లు వాళ్ల జేబుల్లో వేసుకుంటున్నారని విమర్శించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 373 ఎకరాల భూమిని నాదర్‌గుల్‌లో కబ్జా చేశారు. స్థానిక రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. అందుకే ప్రజలందరు మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అవినీతి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

## ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం ఎంతో కష్టపడ్డా

### మాజీ మంత్రి సింగరెడ్డి నిరంజన్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 10: ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం తాను ఎంతో కష్టపడ్డానని, భూమి ఇవ్వాలని రైతుల కాళ్లు మొక్కుతా అని విజ్ఞప్తి చేసినట్లు మాజీ మంత్రి సింగరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలమూరు-రంగారెడ్డిలో భాగమైన ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం నేనొక్కడినే 73 సార్లు వెళ్లి రైతులను కలిశానని గుర్తు చేశారు. ప్రతిసారి వెళ్లి రైతులతో ఓపికతో కూర్చొని రైతులకు నచ్చజెప్పాను. ఒక్కో సందర్భంలో రాత్రి 10 అయ్యేది అన్నారు. వలస పోయిన పాలమూరుకు నీళ్లు వస్తే బాగు పడుద్దని, రైతులకు విజ్ఞప్తి చేసి కాళ్లు మొక్కుతానని విజ్ఞప్తి చేసి భూసేకరణ చేయించానని పేర్కొన్నారు. అంత ఓపికగా కూర్చుంటే రైతులు భూములు ఇచ్చారు. అది వదిలేసి నేను భూములు తీసుకుంటా రైతులు ఏంత? వాళ్లు కూర్చొని ఏం చేస్తారు అని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అంటే కుదరదు. ఆయన తాత వచ్చినా రైతుల భూములు లాక్కొని ప్రాజెక్ట్ కట్టలేరన్నారు. లగచర్లలో భూములు తీసుకుంటే రేవంత్ రెడ్డికే లాగులు తడిచేటట్లు చేశారు అక్కడి రైతులు. అలాగే రైతుల తరఫున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు.

## ముంబై ఎయిర్‌పోర్టులో 29 కిలోల బంగారం సీజ్

### కెన్యా నుంచి వస్తున్న మహిళల నుంచి స్వాధీనం

ముంబై,ఏప్రిల్10 : ముంబై ఎయిర్‌పోర్ట్‌లో 29 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు సీజ్ చేశారు. దీని విలువ సుమారు రూ.38 కోట్లు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. కెన్యాలోని నైరోబీ నుంచి ఈ బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. ముంబై విమానాశ్రయం లో భారీ ఎత్తున బంగారాన్ని అక్రమంగా తీసుకొస్తున్నారని డీఆర్ఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో వెంటనే వారు అప్రమత్తమయ్యారు. ఆపరేషన్ ధహాబు పేరుతో విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కెన్యాలోని నైరోబీ నుంచి వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేయగా.. బంగారం బయటపడింది. కెన్యాకు చెందిన మహిళలు దుస్తులు, బ్యాగుల్లో సుమారు 29 కిలోల బంగారాన్ని దాచినట్లు గుర్తించారు. బంగారాన్ని సీజ్ చేసిన అధికారులు.. మొత్తం 26 మంది కెన్యా దేశస్థులను అరెస్ట్ చేశారు. విమానాశ్రయంలోని గ్రీన్ ఛానల్ దాటిన తర్వాత.. అధికారులను చూసి పారిపోతుండగా.. అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

# ఆటోలో యువకుడి మృతదేహం

- ఉరేసుకున్నట్లుగా రాడ్‌కు శవం
- తమ కొడుకును హత్య చేశారని కుటుంబీకుల ఆరోపణ
- అనుమానాస్పద మృతిగా పోలీసుల దర్యాప్తు

సూర్యాపేట,ఏప్రిల్10 : సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికంగా కలకలం రేపింది. రత్నావత్ మణి భార్గవ్ అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం సమయంలో అటుగా వెళ్తున్న ప్రయాణికులు ఆటోలో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సూర్యాపేట జిల్లా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాలోని చివ్వెంల మండలం ఎంజీనగర్ తండా శివారులో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటోలో ఓ యువకుడు విగతజీవిగా కనిపించడం కలకలం రేపింది. మృతుడిని రత్నావత్ మణి భార్గవ్‌గా గుర్తించారు. మృతుడు ఆటోలో ఉన్న ఇనుప రాడ్డుకు వేళాడుతూ కనిపించాడు. ఈ ఘటనపై ప్రస్తుతం సోషల్ మీడియా, స్థానికుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఇది ఆత్మహత్యా లేక ఎవరైనా చంపి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారా? అనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మణి భార్గవ్‌కు ఎవరితోనైనా గొడవలు ఉన్నాయా? లేదా కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించడానికి క్లూస్ టీమ్‌ను పోలీసులు రంగంలోకి దించినట్లు సమాచారం. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వస్తేనే మరణానికి గల అసలు కారణాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. మణి భార్గవ్ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు, అతను చివరిగా ఎవరితో మాట్లాడారు?, ఎవరితోనైనా ఛాటింగ్ చేశారా? అనే కాల్ డేటా రికార్డులను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. మణి భార్గవ్ మరణ వార్త విన్న అతని తండా, కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తమ కొడుకుది ఆత్మహత్య కాదని, దీని వెనుక ఏదో కుట్ర ఉందని వారు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## రాయలసీమ ప్రాజెక్టులను చంపేసిన వైకాపా

# ఇప్పుడేమో మొసలి కన్నీరా

- ఎవరి హయాంలో ఎంత ఖర్చు చేశారో చర్చకు సిద్ధమా?
- మంత్రి పయ్యావుల కేశవ్ సవాల్



అమరావతి,ఏప్రిల్10 : రాయలసీమ పేరును వైకాపా రాజకీయం కోసమే వాడుకుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాయలసీమలోని ప్రాజెక్టును చంపేసిన వైకాపా నాయకులు.. మొసలి కన్నీరు కార్చడం విడ్డూరమన్నారు. వైకాపా హయాంలో ఆగిన ప్రాజెక్టును తామెలా ఆపగలమని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాటలను వైకాపా నేతలు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టును ఆపింది తామేనన్న బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాటలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాయలసీమకు ఎవరి హయాంలో ఎంత ఖర్చు చేశారో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. మరోవైపు జగన్ నైజం చూసి.. బొత్సకు భయంతో కూడిన బాధ వచ్చిందని మంత్రి పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు. బొత్స అన్న మాటలు గుర్తు చేయడం అచ్చెన్నాయుడి తప్పా అని ప్రశ్నించారు. వైఎస్ మరణం, బాబాయ్ వివేకా హత్యలో అంతిమ లబ్ధిదారు జగన్ కాదా అని వ్యాఖ్యానించారు.రాజకీయ అవసరాల కోసమే రాయలసీమను వైసీపీ వాడుకుంటుందని పయ్యావుల కేశవ్ విమర్శించారు. వైసీపీ హయాంలో రాయలసీమకు ఎంత ఖర్చు పెట్టారో ఆ పార్టీ నేతలు చెప్పాలన్నారు. రాయలసీమ మేలు కోసం వైసీపీ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాయలసీమపై పెట్టిన ఖర్చుపై చర్చకు సిద్ధమా? అంటూ ఆ పార్టీ నేతలకు ఆయన సవాల్ విసిరారు. రాయలసీమలో హార్టికల్చర్ హబ్ పెడతామని చెప్పాం.. తాము చేస్తామని స్పష్టం చేశారు. రాయలసీమ లిఫ్ట్‌పై స్టే విధిస్తే.. వైసీపీ ఏం చేసిందని ప్రశ్నించారు. వివాదాలు సృష్టించేందుకే వైసీపీ-బీఆర్ఎస్ కుట్రలని మండిపడ్డారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే ఏం చేశారంటూ ఆ పార్టీ నేతలను ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ నిలదీశారు. వైసీపీ మొసలి కన్నీరును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడి వ్యాఖ్యల్లో తప్పేముందని వైసీపీ నేతలను మంత్రి పయ్యావుల ప్రశ్నించారు. గతంలో బొత్స చెప్పిన మాటలనే మళ్లీ అచ్చెన్నాయుడు గుర్తు చేశారన్నారు. మీరు చెప్పిన మాటలనే గుర్తు చేస్తే.. ఉలుకెందుకు? అంటూ బొత్సను నిలదీశారు. జగన్ నైజం చూసి బొత్స సత్యనారాయణ బాధపడక ఏం చేస్తారు? అంటూ ఎద్దేవా చేశారు. భయంతో బొత్సకు బాధ కలిగిందేమో? అని వ్యంగ్యంగా అన్నారు. గుండెపోటు నుంచి గొడ్డలిపోటు వరకు.. తండ్రి మరణం నుంచి బాబాయ్ హత్య వరకు.. తల్లి విజయలక్ష్మి నుంచి చెల్లి షర్మిల ఆస్తి తగాదా వరకు.. జగన్ నైజమేంటో ప్రజలకు స్పష్టంగా తెలుసునని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# పరాకాష్టకు చేరిన వైసిపి రాజకీయం

- క్రిమినల్స్ ఇలానే రాజకీయంచేస్తారు
- మంత్రులతో సిఎం చంద్రబాబు నాయుడు



అమరావతి,ఏప్రిల్10 :వైసీపీ అరాచకాలు పరాకాష్టకు చేరాయి. ఎవరిని లేపుతారు.. ఇటువంటి క్రిమినల్స్ చేసే బెదిరింపులకు ఎవరూ భయపడరని సీఎం చంద్రబాబు అన్నారు. వైసిపి క్రిమలన్ రాజకీయాలతో జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సూచించారు. వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఏపీ కేబినెట్‌లో చర్చ జరిగింది. మంత్రి నిమ్మల రామానాయుడు ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'కొత్త పలుకు కాదు... ఇక పలుకే ఉండదు' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు రామానాయుడు కేబినెట్‌కు తెలియజేశారు. దీనిపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. క్రిమినల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఫర్మ్‌గా డీల్ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. బెదిరించి భయపెడదామని అనుకుంటున్నారని మండిపడ్డారు. ఇటువంటి రాజకీయాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా గమనించాలని, అన్ని విషయాలను ప్రజలకు తెలియజేయాలని మంత్రులకు సీఎం సూచించారు. 'క్రిమినల్స్ ఇలానే రాజకీయాలు చేస్తారు. వాళ్ల ఆటలు సాగనివ్వకూడదు. ప్రజలకు నిజాలు తెలియచేస్తే సరిపోతుంది. డైవర్షన్ పాలిటిక్స్‌కు వాళ్లు అలవాటు పడ్డారు' అంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు.

## రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఆమోదం

- క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో మూడు సంస్థల ఏర్పాటు
- విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు
- విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపు
- సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాలు
- కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

అమరావతి,ఏప్రిల్10 :ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో దాదాపు 3 గంటలకు పైగా కేబినెట్ భేటీ కొనసాగగా.. ముఖ్యంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి మంత్రి మండలి ధన్యవాదాలు తెలియజేసింది. ఈ సమావేశంలో 16వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించిన పలు పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడనున్నాయి. అదేవిధంగా, క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా మూడు సంస్థల ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లే కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇక జోనల్ వ్యవస్థకు సంబంధించి కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. రాష్ట్ర పరిపాలనలో సమతుల్యత కోసం తీసుకునే చర్యలపై అధికారులు వివరాలు సమర్పించారు. పలు పరిశ్రమలు, సంస్థలకు భూ కేటాయింపుల విషయంలో కూడా కేబినెట్ అనుమతులు ఇచ్చింది. మొత్తం 60కి పైగా ఎజెండా అంశాలను పరిశీలించిన కేబినెట్, వాటిలో ముఖ్యమైన వాటికి ఆమోదం తెలిపింది. మొత్తానికి, ఈ కేబినెట్ సమావేశం రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేసే పలు నిర్ణయాలతో ముగిసిందని అధికారులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.36 లక్షల కోట్లు పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తద్వారా 9.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. సమావేశం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం ఇచ్చింది. సత్యసాయి జిల్లాలో ఔట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సౌకర్యం రానుంది. సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాల కేటాయింపునకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐఐసీ, టీసీఎస్ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐఐసీ, రహేజా కార్ప్ సంస్థ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదంఇచ్చారు.

## కాలిన నోట్ల కట్టల వ్యవహారం

### పదవికి రాజీనామా చేసిన జస్టిస్ యశ్వంత్ వర్మ



న్యూఢిల్లీ,ఏప్రిల్10 : అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఢిల్లీలోనితన నివాసంలో కాలిన నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆయనను తొలగించేందుకు అభిశంసన ప్రక్రియకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. గతేడాది మార్చి 14న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైన విషయం తెలిసిందే. దీంతో ఇక లాభం లేదనుకుని ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

## మరోమారు షాకిచ్చిన పసిడి ధర

### ఏకంగా రూ.1,520 పెరుగుదల



న్యూఢిల్లీ,ఏప్రిల్10 : పసిడి ప్రియులకు మరోసారి షాకిస్తూ బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడి పరుగు కొనసాగుతోంది. తాజాగా 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధరపై ఏకంగా రూ.1,520 పెరగడంతో, ప్రస్తుతం రూ.1,53,000 మార్కుకు చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ.1,400 మేర ఎగబాకి, 10 గ్రాముల ధర రూ.1,40,250 వద్ద కొనసాగుతోంది. పసిడితో పాటే వెండి కూడా అదే స్థాయిలో దూసుకుపోతోంది. కిలో వెండి ధరపై ఏకంగా రూ.5,000 పెరగడంతో ప్రస్తుత ధర రూ.2,65,000కి చేరింది. వరుసగా పెరుగుతున్న ఈ ధరలతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## నేడు లేదా రేపు ఇంటర్ ఫలితాలు



హైదరాబాద్, ఏప్రిల్ 10: తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల విడుదలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, రాష్ట్ర విద్యాశాఖ ఏప్రిల్ 12న ఆదివారం ఫలితాలను వెల్లడించేందుకు రంగం సిద్ధం చేసినప్పటికీ, పలు జాతీయ స్థాయి నివేదికల ప్రకారం ఒక రోజు ముందే అంటే ఏప్రిల్ 11న శనివారం కూడా ఫలితాలు వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18 వరకు జరిగిన వార్షిక పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ , ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఒకేసారి విడుదల చేసేందుకు బోర్డు అన్ని కసరత్తులు పూర్తి చేసింది. విద్యార్థులు తమ ఫలితాలను విడుదలైన వెంటనే అధికారిక వెబ్‌సైట్లలో హాల్ టికెట్ నంబర్‌ను నమోదు చేసి మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## కేబుల్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు

### వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్న కమిషనర్




హైదరాబాద్, ఏప్రిల్ 10: కేబుల్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులు రాష్ట్ర,జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డులు పొందటానికి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ సి హెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగర కేంద్రంగా స్టూడియోలు కలిగి, స్థానికంగా, జిల్లాలలో ప్రసారాలు అందించే చానళ్ళు రాష్ట్ర,జిల్లా స్థాయిలో కార్డులు పొందటానికి, జిల్లా స్థాయిలో స్టూడియోలు కలిగిన వారు ఆయా జిల్లాల్లో కార్డులు పొందటానికి నేరుగా ఈ నెల 17 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తులో ఛానల్ పేరు మరియు స్టూడియో అడ్రస్ తో పాటు, ఎమ్ ఐ బి సర్టిఫికెట్, లేబర్ లైసెన్స్, ఎం ఎస్ ఓ లతో చేసుకున్న ఛానల్ ప్లేస్మెంట్ అగ్రిమెంట్ల కాపీలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.అర్హత గల ఛానళ్లకు రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో అక్రిడేషన్స్ జారీ చేయబడతాయని వివరించారు.

## లెబనాన్‌లపై దాడుల్లో పౌరుల మృతిపై భారత్ ఆందోళన

ఉందన్నారు. ఇకపోతే లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న వైమానిక దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో పౌరులు మరణించినట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఉద్రిక్తలు తగ్గించి సంయమనం పాటించాలని కోరింది. అంతర్జాతీయ చట్టాల గౌరవం, పౌరుల రక్షణ అత్యంత ముఖ్యమని స్పష్టం చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. లెబనాన్ ఈ ఒప్పందం పరిధిలోకి రాదని ఇజ్రాయెల్ వాదిస్తోంది. లెబనాన్‌పై దాడులు ఆపకుంటే అమెరికాతో శాంతి చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ హెచ్చరిస్తోంది. 'లెబనాన్‌పై దాడుల్లో పెద్దసంఖ్యలో పౌరులు మరణించినట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. యూఎన్ఐఎఫ్ఐఎల్‌కు ట్రూప్ కంట్రిబ్యూటింగ్ దేశంగా లెబన్‌నాన్‌లో శాంతి, భద్రతలకు భారత్ ఎంతో వెచ్చిస్తోంది. జరుగుతున్న పరిణామాలు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి. పౌరుల రక్షణ, అంతర్జాతీయ చట్టాలు, దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని కోరుతున్నాం . భారతదేశం ఎప్పుడూ పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. లెబనాన్‌లోని భారత పౌరుల భద్రతను అక్కడి ఇండియన్ ఎంబసీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది' అని విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైశ్వాల్ మీడియా సమావేశంలో తెలిపారు. పశ్చిమాసియాలో పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్నామని, గల్ఫ్ ప్రాంతాల్లోని దేశాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు సాగిస్తున్నామని జైశ్వాల్ తెలిపారు.

## అన్నా.. నన్ను దేవుడే పంపిండు...

అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు. ఈ సంధ్భంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు. జీవన్ రెడ్డి కూడా కెసిఆర్‌కు శాలువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉండి, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం, కేసీఆర్‌ను 'అన్నా' అని సంబోధిస్తూ భావోద్వేగానికి లోనవ్వడం చూస్తుంటే.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవించబోతున్నాయని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఈ చేరిక ఒక పెద్ద ఊతమివ్వనుంది.

## మావోయిస్టులు లొంగుబాటు

హైదరాబాద్‌కు తరలించారు. మావోయిస్టు నేత హిడ్మా గెరిల్లాను వదిలి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి వెళ్లిన తర్వాత బెటాలియన్ బాధ్యతలను బడ్సే దేవాకు, కేశాలుకు అప్పగించారు. అయితే, కొన్ని రోజులు కిందటే కమాండర్ దేవా.. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుపోయారు. ఆ తర్వాత బెటాలియన్ బాధ్యతలు నిర్వహిస్తున్న సోడిమల్ల కేశాలు సైతం తాజాగా శుక్రవారం లొంగిపోయారు. ఇతనికి సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ వంటి పేర్లున్నాయి. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు.మొత్తం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో గెరిల్లా బెటాలియన్ కమాండర్ సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ ఉన్నారని వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలు, బంగారంతో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. 36 తుపాకులు, ఐదు ఏకే 47లు, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, 1,007 తూటాలతో పోలీసులు ముందు మావోలు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. అలాగే 800 గ్రాముల బంగారం సైతం అప్పగించినట్లు వెల్లడించారు. వీరి లొంగుబాటుతో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పూర్తిగా కనుమరుగైనట్లు డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు.గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా డీజీపీ ఎదుట లొంగిపోయారు. వీరిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ కేశాలు కూడా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ పెరగడంతో మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందివారు కాగా.. ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. 'లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీ కింద రూ.1.93 కోట్లు అందజేస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్యకార్డులు అందజేస్తాం. తెలంగాణకు చెందిన వాళ్లు సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరున్నారు. స్టేట్ కమిటీలో తెలంగాణ వాళ్లు 24 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరే ఉన్నారు. వాళ్లు కూడా లొంగిపోవాలని పిలుపునిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు.

## కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కూడా కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు.

# నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు

- నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటన
- భారీగా బందోబస్తు ఏర్పాటు



ఇస్లామాబాద్,ఏప్రిల్10 : అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం తొలగిపోలేదు. సీజ్‌ఫైర్ వేళ.. శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న శనివారం రాజధాని ఇస్లామాబాద్‌లో ఈ చర్చ లు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది. ఇస్లామాబాద్‌లో దేశ పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలున్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. ఈ చర్చల నేపథ్యంలో గురువారం, శుక్రవారం ఇస్లామాబాద్‌లో సెలవు ప్రకటించారు. దుకాణాలు మూతపడ్డాయి.తమ మధ్యవర్తిత్వంతోనే రెండు వారాల పాటు కాల్పుల విరమణ జరిగిందని చెప్పిన పాకిస్థాన్ (KJÜ‹_J").. ఇప్పుడు ఇరుదేశాల మధ్య శాంతిచర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నేతృత్వంలోని బృందం అమెరికా తరపున చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాక్ బయల్దేరారంటూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. వారిద్దరూ తమ రాజధాని టెహ్రాన్‌లోనే ఉన్నారని చెప్పింది. ఒకవేళ చర్చలంటూ జరిగితే.. హార్మూజ్‌పై నియంత్రణ, తమ దేశంపై ఉన్న ఆంక్షల నుంచి ఉపశమనం, తన మిత్రపక్షాలపై దాడులు చేయకూడదంటూ 10 పాయింట్ల డిమాండ్ల పైనే ఇరాన్ పట్టుబట్టే అవకాశం ఉంది. ఇక, లెబనాన్‌లోని ఇరాన్ మిత్రపక్షం హెజ్‌బొల్లా గ్రూప్‌పై ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆగడం లేదు. సీజ్÷ర్ ప్రకటన తర్వాతే అక్కడ మారణహోమం సృష్టించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న అపనమ్మకం, ఇజ్రాయెల్ దూకుడు కారణంగా ఈ చర్చల్లో పురోగతిని ఆశించలేమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# శ్రీకాకుళం సాగునీటిని గాలికి వదిలేసిన వైసిపి





- జిల్లాకు సాగునీటి వసతి కల్పించడమే లక్ష్యం
- వంశధారతో సమస్యలను తీర్చే ప్రయత్నం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 : ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళంలో సాగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారితమని, జిల్లా ప్రజలకు సాగునీటి భద్రత కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాను సస్యశ్యామలం చేయాలని పూనుకున్నట్లు ఆయన చెప్పారు. 2010లో వంశధార ట్రిబ్యునల్ ఏర్పాటు అయ్యిందని.. అప్పటి నుంచి నేరడి బ్యారేజ్ విషయంలో ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు ఆయన చెప్పారు.2024లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేరడి బ్యారేజ్ సమస్యపై దృష్టి పెట్టామని ఈ సందర్భంగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వం రావటంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. వంశధార ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చుకున్నామని.. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీనిపై వైసీపీ నేతలు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అయినా తన మొదటి ప్రాధాన్యత జిల్లా అభివృద్ధికే అని రామ్మోహన్ స్పష్టం చేశారు. త్వరలో నేరడి బ్యారేజ్ పనులు ప్రారంభమవుతాయని.. రైల్వే జోన్ సాధించుకోవటం మరో విజయమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలోని ఏడు రైల్వేస్టేషన్లను కొత్త రైల్వే జోన్‌లో పెట్టించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తిరుపతి వెళ్లే భక్తుల కోసం హంసఫర్ ఎక్స్‌ప్రెస్ ఇకపై శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుందంటూ ఆయన గుడ్ న్యూస్ చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశామని.. పొందూరు ఖాదీకి జియో ట్యాగ్ సాధించామనీ వెల్లడించారు. కేంద్రం నుంచి జిల్లాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తున్నానని రామ్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆగ్రహించారు. ప్రజల కోసం పని చేసే నేతలైతే కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేసిన పనులను అభినందించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అమరావతి బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చిందని.. జగన్ పార్టీ మాత్రం బిల్లు సందర్భంగా పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందని మండిపడ్డారు. అమరావతి చట్టబద్ధత కోసం సీఎం చంద్రబాబు నాయుడు చాలా కృషి చేశారని చెప్పుకొచ్చారు. రాజధానిగా అమరావతికి రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా సంపూర్ణ మద్దతు ఇచ్చారని చెప్పుకొచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు రాజధానిపై జగన్ మూడు ముక్కలాట ఆడారని.. ఇప్పుడూ అదే డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. అమరావతి పూర్తయితే చంద్రబాబు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న భయం వైసీపీదని ఆరోపించారు. జాతీయస్థాయిలో చంద్రబాబుది ఓ ప్రత్యేక గుర్తింపని కొనియాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనేది వైసీపీ అజెండా అయితే.. చంద్రబాబుది అభివృద్ధి అజెండా అని పేర్కొన్నారు. ప్రజలు ఛీ కొట్టినా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని.. చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయమంటూ నిప్పులు చెరిగారు. విశాఖ రాజధాని పేరుతో వైసీపీ నేతలు భూదందా చేశారని ఆరోపించారు రామ్మోహన్ నాయుడు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పూర్తవుతాయని.. కేంద్రం సహకారంతో రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఒక పక్క అభివృద్ధి జరుగుతుంటే మరో పక్క వైసీపీ నేతలు గుంట నక్క రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ఆగ్రహించారు.

# ఎదల ప్రభుత్వంపై ప్రతిపక్షాల బురద రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

మంజూరైన రూ. 58.58 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలిన ఈ ప్రభుత్వం పేదవారికి అండగా ఉంటుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ధాన్యం కొన్న వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ. 20,670 కోట్ల మేర రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని ఏడాదికి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తూ, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త గా 3.80 లక్షల మందికి పాస్ పుస్తకాలను అందజేశామన్నారు. ధరణి తో రైతులు ఇబ్బందులు



పడ్డారని దాన్ని బంగాళాఖాతంలో వేసి భూ భారతి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం వెంకటాపురంలో దేపంగి శ్రీకాంత్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తదుపరి డిజిపిగా సివి ఆనంద్ ?


రాష్ట్రంలో సుదీర్ఘ కాలం వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం దృష్ట్యా సి.వి. ఆనంద్ పేరుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండుసార్లు డీజీపీ పదవికి ఆయన పేరు పరిశీలనలోకి వచ్చినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల అవకాశం దక్కలేదు, కానీ ఈసారి సుప్రీం మార్గదర్శకాల ప్రకారం శాశ్వత ప్రాతిపదికనఆయన నియమితులయ్యే అవకాశం ఉంది. ఈ నియా మకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఈ నెల 14వ తేదీ తర్వాత వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవేళ సి.వి. ఆనంద్ బాధ్యతలు చేపడితే,ఆయనపదవీ కాలం 2028మే వరకు ఉంటుంది. మరోవైపు, మహిళా అధికారులకు కూడా ప్రాధాన్యత ఇస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఒక మహిళా డీజీస్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వంయోచిస్తోంది.హైకోర్టు ఆదేశాల ప్రకా రం13 నాటికి డీజీపీ నియామకంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో, త్వరలోనే రాష్ట్ర పోలీస్ శాఖలో ఈ కీలక మార్పు చోటుచేసుకోనుంది.

## 'హర్మూజ్' నిర్వహణపై మొజ్తాబా కీలక ప్రకటన..

(మొదటిపేజీ తరువాయి)

ఇరాన్ స్పష్టమైన విజయం సాధించిందని ఖమేనీ చెప్పారు. ఈ దాడుల్లో జరిగిన నష్టాలన్నింటికీ పరిహారం చెల్లించాలని తాము డిమాండ్ చేస్తామని అన్నారు. హర్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ అత్యంత దారుణంగా వ్యవహరిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మండిపడ్డారు. జలసంధి మీదుగా వెళ్లే ట్యాంకర్లపై ఇరాన్ టోల్ వసూలు చేస్తున్నట్లు వెలువడుతున్న వార్తల గురించి ప్రస్తావించారు. వారు అలా చేసి ఉండకూడదని, ఒకవేళ చేస్తే వెంటనే ఆపేయాలని ఆయన ట్రూత్ సోషల్ వేదికగా హెచ్చరించారు. ఇరాన్ సహకరించినా, సహకరించకపోయినా జలసంధి మీదుగా చమురు రవాణా త్వరగా ప్రారంభమవుతుందని మరో పోస్టులో తెలిపారు.

## 13 ఏళ్ల బాలికపై లైంగిక దాడి



హైదరాబాద్, ఏప్రిల్ 10: నగరంలోని కాచిగూడలో దారుణం చోటు చేసుకుంది. 13 ఏళ్ల బాలికపై 15 ఏళ్ల బాలుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికకు పరిచయమైన నిందితుడు.. ఆమెతో స్నేహం పెంచుకొని లైంగిక దాడి చేశాడు. ఈ కేసులో బాలుడిని అరెస్టు చేసిన పోలీసులు.. అతడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

## ఎయిడ్స్ ఇంజక్షన్ దాడికి గురైన యువతి ఆత్మహత్య



హైదరాబాద్, ఏప్రిల్ 10: నగరంలోని పోచారం ఐటీకారిడార్ ఓఉన్నాది ఎయిడ్స్ ఇంజక్షన్‌తో దాడికి గురైన యువతి ఆత్మహత్య చేసుకుంది. రమణి అనే యువతి పెళ్లికి నిరాకరించిందన్న కసితో మనోహర్ అనే ఎయిడ్స్‌గ్రస్తుడు గత నెల 11న యువతిని బెదిరించి ఎయిడ్స్ ఉన్న రక్త ఇంజక్షన్ ఇచ్చాడు. అన్నోజిగూడ రాజీవ్ గృహ కల్పలో ఉంటున్న యువతి శుక్రవారం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా ఈ ఘటనలో ఇప్పటికే నిందితుడు మనోహర్ ప్రస్తుతం జైలులో ఉన్నాడు

## పెళ్లికి ఒప్పుకోలేదని హెచ్ఐవీ రక్తం ఎక్కించిన ప్రియుడు.. యువతి ఆత్మహత్య..!

హైదరాబాద్, ఏప్రిల్ 10: నగరంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. పెళ్లికి నిరాకరించిందని ప్రియుడు ఆమెకు హెచ్ఐవీ సోకిన రక్తాన్ని ఎక్కించాడు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్య చేసుకుంది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దారుణ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లాకు చెందిన మనోహర్ (24), తన మరదలైన 20 ఏళ్ల యువతి చిన్నప్పటి నుంచి ప్రేమించుకుంటున్నారు.రెండు కుటుంబాల అంగీకారంతో వారి వివాహం కూడా నిశ్చయమైంది. అయితే పెళ్లికి ముందు నిర్వహించిన వైద్య పరీక్షల్లో మనోహర్‌కు హెచ్ఐవీ పాజిటివ్ అని నిర్ధారణ అయింది. యువకుడి తల్లిదండ్రులు హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తులు కావడంతో యువతి తండ్రి ముందు జాగ్రత్తగా యువకుడికి కూడా టెస్ట్ చేయించాడు. దాంతో అతడికి కూడా హెచ్ఐవీ సోకిన విషయం వెల్లడైంది. దాంతొ యువతి కుటుంబం పెళ్లిని రద్దు చేసుకుంది.దీన్ని తట్టుకోలేకపోయిన మనోహర్.. తన ప్రియురాలిపై కక్ష పెంచుకున్నాడు. యువతికి కూడా హెచ్ఐవీ సోకితే.. ఆమెను ఎవరూ పెళ్లి చేసుకోరని, అప్పుడు తనకే ఇచ్చి వివాహం చేస్తారని కిరాతకంగా ఆలోచించాడు. ఈ క్రమంలో గత నెల 11న సిరంజిలో తన రక్తాన్ని నింపుకుని యువతి ఇంటికి వెళ్లాడు. పెళ్లి చేసుకుందాం అని మరోసారి అడిగాడు. అయినా ఆమె పెళ్లికి ఒప్పుకోకపోవడంతో బలవంతంగా ఆ రక్తాన్ని సిరంజి ద్వారా ఆమె శరీరంలోకి ఎక్కించి పరారయ్యా డు.ఈ ఘటనపై బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మనోహర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. అయితే ఈ ఘటనతో తీవ్ర మానసిక వేదనకు లోనైన బీటెక్ విద్యార్థిని.. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భూసేకరణ కోసం రైతుల కాళ్లు మొక్కడానికి సిద్ధపడ్డా

### మాజీ మంత్రి సింగరెడ్డి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 10: ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం తాను ఎంతో కష్టపడ్డానని, భూమి ఇవ్వాలని రైతుల కాళ్లు మొక్కుతా అని విజ్ఞప్తి చేసినట్లు మాజీ మంత్రి సింగరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాల మూరు-రంగారెడ్డిలో భాగమైన ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం నేనొక్కడినే 73 సార్లు వెళ్లి రైతులను కలి శానని గుర్తు చేశారు. ప్రతిసారి వెళ్లి రైతులతో ఓపికతో కూర్చొని రైతులకు నచ్చజెప్పాను. ఒక్కో సందర్భంలో రాత్రి 10 అయ్యేది అన్నారు. వలస పోయిన పాలమూరుకు నీళ్లు వస్తే బాగు పడుద్దని, రైతులకు విజ్ఞప్తి చేసి కాళ్లు మొక్కు తానని విజ్ఞప్తి చేసి భూసేకరణ చేయించానని పేర్కొన్నారు.అంత ఓపికగా కూర్చుంటే రైతులు భూములు ఇచ్చారు. అది వదిలేసి నేను భూములు తీసుకుంటా రైతులు ఏంత? వాళ్లు కూర్చొని ఏం చేస్తారు అని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అంటే కుదరదు. ఆయన తాత వచ్చినా రైతుల భూములు లాక్కొని ప్రాజెక్ట్ కట్టలేరన్నారు. లగచర్లలో భూములు తీసుకుంటే రేవంత్ రెడ్డికే లాగులు తడిచేటట్లు చేశారు అక్కడి రైతులు. అలాగే రైతుల తరపున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు.

## పాత పథకానికి కొత్త మెరుగులు..!

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి మార్క్ అభివృద్ధి

హైదరాబాద్, ఏప్రిల్ 10: జనగామ జిల్లా లింగాల గణపురం మండలం పటేల్ గూడెంలో కడియం శ్రీహరి ప్రారంభించిన పథకం విమర్శలకు తావిస్తోంది. గతంలో ప్రారంభించిన పథకానికే మెరుగులు దిద్ది పాత శిలాఫలకం కనిపించకుండా కొత్తగా కడియం ప్రారంభిస్తున్నట్టు శిలాఫలకాన్ని ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పటేల్ గూడెంలో స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యేగా డాక్టర్ తాటికొండ రాజయ్య ఉన్నప్పుడు ఆ గ్రామానికి వాటర్ ప్లాంట్ మంజూరు అయింది. పథకం పూర్తి కాగానే అప్పటి ఎమ్మెల్యే రాజయ్య పథకాన్ని ప్రారంభించారు.దానికి సంబంధించిన శిలాఫలకాన్ని సైతం వేశారు. అదే పథకానికి కడియా శ్రీహరి రెండు లక్షల రూపా యలు మంజూరు చేయించి కొత్తగా మెరుగులు దిద్దించారు. పాత శిలాఫలకం కనిపించకుండా ఆ శిలాఫలకం పైనే కొత్తగా కడియం శ్రీహరి ప్రారంభిస్తున్నట్లు శిలాఫలకాన్ని వేయించారు. నియోజవర్గానికి తాను అభివృద్ధి ప్రదాతను అని పదేపదే ప్రకటించుకుంటున్న కడియం శ్రీహరి..పాత పథకాలను కొత్తగా మెరుగులు దిద్ది ప్రారంభించి ఇదేనా కడియంమార్క్‌అభివృద్ధి అంటూఆగ్రామస్తులుఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు.

# ప్రారంభోత్సవానికి రెడీ అవుతున్న భోగాపురం

**జూలైలో ప్రారంభోత్సవానికి తేదీలు ఖరారు**

**జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన డేట్లు ఫిక్స్ చేసిన ప్రభుత్వం**

**ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీకి ఆహ్వానం**

**బలగం టీవీ, విశాఖపట్నం**

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఏపీ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూలై మొదటి వారంలో ఈ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇప్పటికే ఆహ్వానం పంపారు. మోదీ షెడ్యూల్ ఆధారంగా జూలై 5వ తేదీ లేదా 8వ తేదీల్లో ఒకటి ఖరారు కానుంది. జూన్ 30వ తేదీ కల్లా మిగిలిన అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తున్నారు. అంతర్జాతీయ విమానాల రాకపోకల కోసం అవసరమైన ఇమ్మిగ్రేషన్ స్టేటస్ నోటిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేసింది.

విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. విశాఖపట్నం నుంచి భోగాపురం వెళ్లే మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఆనందపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఫ్లై ఓవర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. దీనికి సంబంధించిన



డీపీఆర్ 45 రోజుల్లో సిద్ధం కానుంది.భోగాపురం వరకు మెట్రో సౌకర్యాన్ని కల్పించేందుకు సంస్థ సవరించిన డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. ఇది డబుల్ డెక్కర్ మోడల్‌లో ఉండబోతోంది (కింద రోడ్డు, పైన మెట్రో). విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి భోగాపురం వరకు ఈ కారిడార్ విస్తరించనుంది. రోడ్ నంబర్ 12, 14 పనుల కోసం అటవీ, రక్షణ శాఖల అనుమతులను వేగవంతం చేశారు. తీర ప్రాంతం వెంట విశాఖను భోగాపురంతో కలిపే ప్రత్యేక కోస్టల్ కారిడార్ పనులు కూడా ఊపందుకున్నాయి. భోగాపురం ఎయిరోసిటీ, ఐటీ హబ్స్, లాజిస్టిక్ పార్కుల వల్ల ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి లభించనుంది.అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ విమానాశ్రయం వల్ల ఉత్తరాంధ్రలోని పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది.ఫార్మా,

మత్స్య పరిశ్రమల ఎగుమతులకు ఈ విమానాశ్రయం కేంద్ర బిందువుగా మారనుంది.భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు త్వరలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వ సహకారంతో ఏపీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు జూలై మొదటి వారంలో ప్రారంభించాటానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇదో మైలు రాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించటానికి ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# తల్లీకూతుళ్ల హత్య కేసులో పురోగతి

- **భర్తే వారిని స్విమ్మింగ్ పూల్‌లో తోసేసి హత్య న**
- **ఆడపిల్లలు పుడుతున్నారని హత్యకు పన్నాగం**

**బలగం టీవీ, వరంగల్**

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన తల్లీకూతుళ్ల హత్య కేసు దర్యాప్తులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో భర్తతో పాటు పదిమంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు డాక్టర్లు బాల్నె పూర్ణిమ, ఎస్.రవళి పరారీలో ఉన్నారు. ఐనవోలు మండలం పున్నేలులో ఈనెల 1న భార్య, ఇద్దరు కూతుళ్లను భర్త స్విమ్మింగ్ పూల్‌లో నెట్టేసి చంపేసిన ఘటన సంచలనం రేపింది. భార్యకు ఆడపిల్లలే పుడుతున్నారని భర్త అజారుద్దీన్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు.అప్పటికే భార్య ఫరహాత్ గర్భవతి. ఫరహాత్‌కు గతంలోనూ రెండు అబార్షన్లు చేయించాడు అజారుద్దీన్. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. తల్లీకూతుళ్ల హత్యకు సహకరించిన కుటుంబ సభ్యులతో పాటు లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన సిబ్బంది, అబార్షన్లు చేసిన డాక్టర్లను నిందితులుగా తేల్చారు. కొడుకే పుట్టాలన్న కోరికతో నిందితుడు అజారుద్దీన్.. భార్య, ఇద్దరు కూతుళ్లను చంపేశాడని సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అప్పటికే భార్యకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి రెండు అబార్షన్లు చేయించాడని.. మరోసారి భార్య ఫరహాత్ గర్భం దాల్చడంతో ఆమెకు మళ్లీ ఆడపిల్లే పుడుతుందన్న భయంతో చంపేసినట్లు వివరించారు. ఓ బాలికను వివాహం చేసుకోవాలని అనుకున్నాడని.. పథకం ప్రకారమే భార్య, పిల్లలను తన స్విమ్మింగ్ పూల్‌కు తీసుకెళ్లి నీళ్లలో ముంచి చంపేసినట్లు చెప్పారు. అయితే.. అనుమానాస్పద మృతిగా నమోదైన ఈ కేసులో.. సెక్షన్లను మార్చి నిందితులకు కఠిన శిక్షపడేలా చేస్తామని తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని సిఫార్సు చేస్తామన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేసిన వారిపై గతంలోనూ కేసులున్నాయని సీపీ పేర్కొన్నారు.

# వివాదంలో మోనాలిసా పెళ్లి

- **పెళ్లినాటికి ఆమె మైనర్ అని గుర్తింపు**
- **భర్తపై ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు**

**బలగం టీవీ, లక్నో**



కుంభమేళాలో ఒక్క ఫోటోతో రాత్రికి రాత్రే సోషల్ మీడియా స్టార్‌గా మారిన గిరిజన యువతి మోనాలిసా ఇప్పుడు తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ఆమె ప్రేమ వివాహం చట్టపరమైన సమస్యల్లో పడడంతో చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన మోనాలిసా, అనంతరం ఫర్మన్ ఖాన్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. అయితే ఈ పెళ్లి చట్టబద్ధతపై అనుమానాలు వ్యక్తమవడంతో విచారణ ప్రారంభమైంది.జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టగా, అసలు విషయం మోనాలిసా మైనర్ అని తేలింది. మహేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రి రికార్డుల ప్రకారం మోనాలిసా 2009 డిసెంబర్ 30న జన్మించినట్లు తేలింది. అంటే 2026 మార్చిలో వివాహం జరిగే సమయానికి ఆమె వయస్సు కేవలం 16 సంవత్సరాలు మాత్రమే. వివాహానికి కనీస వయస్సు లేకపోవడంతో, ఆమె భర్తపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరో సంచలన అంశం కూడా బయటపడింది. పెళ్లి జరిపించేందుకు మోనాలిసా పుట్టిన తేదీని మారుస్తూ నకిలీ ధృవీకరణ పత్రాలు సృష్టించినట్లు దర్యాప్తులో తేలింది. 2008లో పుట్టినట్లు చూపిస్తూ తప్పుడు సర్టిఫికెట్ల ఆధారంగా కేరళలోని ఆలయంలో వివాహం నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు.ఈ వ్యవహారంలో కొన్ని సంస్థల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది సాధారణ ప్రేమ వివాహం కాదని, ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా చేసిన చర్యగా అధికారులు పరిశీలిస్తున్నారు. కేరళ నుంచి మధ్యప్రదేశ్ వరకు విస్తరించిన ఈ కేసును విచారణ బృందం కేవలం 72 గంటల్లోనే కీలకంగా ఛేదించింది. మహేశ్వర్ మున్సిపల్ అధికారులు ఇచ్చిన పాత జనన ధృవీకరణ పత్రాన్ని రద్దు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మోనాలిసా తల్లిదండ్రులు సమర్పించిన కుల ధృవీకరణ పత్రాల ద్వారా ఆమె షెడ్యూల్డ్ తెగకు చెందిన మైనర్ బాలిక అని కూడా నిర్ధారితమైంది. మైనర్ బాలికని వివాహం చేసుకున్నందుకు ఫర్మన్ ఖాన్ ప్రస్తుతం తీవ్రమైన చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడంతో అతనిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## హెచ్‌ఐవి రక్తం ఎక్కించిన ఘటన..

**ఆత్మహత్య చేసుకున్న యువతి**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రేమించిన అమ్మాయికి హెచ్ఐవీ రక్తం ఎక్కించిన ఘటనలో సదరు యువతి రమణి(23) ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మేడ్చల్ జిల్లా అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పలోని తమ ఇంట్లో రమణి ఆత్మహత్యకు పాల్పడింది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రమణి.. ఎదులాబాద్‌లోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. అయితే, సమీప బంధువైన మనోహర్‌తో ఆమెకు నిశ్చితార్థం చేశారు కుటుంబసభ్యులు. పెళ్లికి అంతా సిద్ధమైన తర్వాత వైద్య పరీక్షల్లో అతనికి ఎయిడ్స్ ఉందని తేలింది. దీంతో యువతి కుటుంబసభ్యులు మనోహర్‌తో పెళ్లికి నిరాకరించారు. ఇది మనసులో పెట్టుకున్న నిందితుడు తనను వివాహం చేసుకోవాలని రమణిని పలుమార్లు బలవంతం చేశాడు. ఆమె ఒప్పుకోక పోవడంతో ఈ ఏడాది మార్చి 11న ఇంట్లో యువతి ఒంటరిగా ఉన్న సమయంలో వచ్చి బలవంతంగా హెచ్ఐవీ రక్తాన్ని ఎక్కించాడు. అనంతరం మనోహర్ అక్కడ్నుంచి పారిపోయాడు. బాధిత యువతి విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతో ఈ ఘటన సంచలనంగా మారింది. రమణి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మనోహర్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ఈ ఉదంతం మొత్తాన్ని అవమానకరంగా భావించిన యువతి శుక్రవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకుంది.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి

**కారేపల్లి ఎంఈఓ జయరాజు పిలుపు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కారేపల్లి ఎంఈఓ జయరాజు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బొక్కలతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 5వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యా బోధన ఉంటుందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరం నుండి 21 రకాల వస్తువులతో కూడిన కిట్ ను విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. అదేవిధంగా అల్పాహారం కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు, కోమట్ల గూడెం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శారద, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంగిలాల్ ఉపాధ్యాయులు రజిని కుమారి శుక్ర,ఎమ్మార్సీ సిబ్బంది మోతిలాల్, విజయ్, కుమార్,పరమేష్,రాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం సాగునీటిని గాలికి వదిలేసిన వైసిపి

**జిల్లాకు సాగునీటి వసతి కల్పించడమే లక్ష్యం**

**వంశధారతో సమస్యలను తీర్చే ప్రయత్నం**

**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళంలో సాగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారితమని, జిల్లా ప్రజలకు సాగునీటి భద్రత కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాను సస్యశ్యామలం చేయాలని పూనుకున్నట్లు ఆయన చెప్పారు. 2010లో వంశధార ట్రైబ్యునల్ ఏర్పాటు అయ్యిందని.. అప్పటి నుంచి నేరడి బ్యారేజ్ విషయంలో ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు ఆయన చెప్పారు.

2024లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేరడి బ్యారేజ్ సమస్యపై దృష్టి పెట్టామని ఈ సందర్భంగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వం రావటంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. వంశధార ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చుకున్నామని.. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీనిపై వైసీపీ నేతలు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అయినా తన మొదటి ప్రాధాన్యత జిల్లా అభివృద్ధికే అని రామ్మోహన్ స్పష్టం చేశారు. త్వరలో నేరడి బ్యారేజ్ పనులు ప్రారంభమవుతాయని.. రైల్వే జోన్ సాధించుకోవటం మరో విజయమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలోని ఏడు రైల్వేస్టేషన్లను కొత్త రైల్వే జోన్‌లో పెట్టించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తిరుపతి వెళ్లే భక్తుల కోసం హంసఫర్ ఎక్స్‌ప్రెస్ ఇకపై శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుందంటూ ఆయన గుడ్ న్యూస్ చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశామని.. పొందూరు ఖాదీకి జియో ట్యాగ్ సాధించామనీ వెల్లడించారు. కేంద్రం నుంచి జిల్లాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తున్నానని రామ్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆగ్రహించారు. ప్రజల కోసం పని చేసే నేతలైతే కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేసిన పనులను అభినందించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అమరావతి బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చిందని.. జగన్ పార్టీ మాత్రం బిల్లు సందర్భంగా పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందని మండిపడ్డారు. అమరావతి చట్టబద్ధత కోసం సీఎం చంద్రబాబు నాయుడు చాలా కృషి చేశారని చెప్పుకొచ్చారు. రాజధానిగా అమరావతికి రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా సంపూర్ణ మద్దతు ఇచ్చారని చెప్పుకొచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు రాజధానిపై జగన్ మూడు ముక్కలాట ఆడారని.. ఇప్పుడూ అదే డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. అమరావతి పూర్తయితే చంద్రబాబు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న భయం వైసీపీదని ఆరోపించారు. జాతీయస్థాయిలో చంద్రబాబుది ఓ ప్రత్యేక గుర్తింపని కొనియాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనేది వైసీపీ అజెండా అయితే.. చంద్రబాబుది అభివృద్ధి అజెండా అని పేర్కొన్నారు. ప్రజలు ఛీ కొట్టినా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని.. చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయమంటూ నిప్పులు చెరిగారు. విశాఖ రాజధాని పేరుతో వైసీపీ నేతలు భూదందా చేశారని ఆరోపించారు రామ్మోహన్ నాయుడు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పూర్తవుతాయని.. కేంద్రం సహకారంతో రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఒక పక్క అభివృద్ధి జరుగుతుంటే మరో పక్క వైసీపీ నేతలు గుంట నక్క రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ఆగ్రహించారు.

# పదేళ్లలో తెలంగాణను ఆగం చేశారు

- **ఇప్పుడేమో ఘనకార్యాలు చేసినట్లు బిల్డప్**
- **హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ జూపల్లి**

**బలగం టీవీ, హైదరాబాద్**



గత ప్రభుత్వ నాయకులకు సరైన ఆలోచన, అవగాహన లేక రాష్ట్రానికి తీవ్ర నష్టం చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. నీళ్ల లేని చోట మాత్రం పదేళ్లలో అనేక ప్రాజెక్టులు కట్టారని విమర్శించారు. కాళేశ్వరం ఇందుకు నిదర్శనమని అన్నారు. పలమూరులో పదేళ్లుగా ఒక్క పని చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ధనిక రాష్ట్రం అప్పగిస్తే, రూ.8 లక్షల కోట్లు ఎందుకు అప్పు చేశారని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు కాలువలకు ఇంకా అనుమతే రాలేదన్న జూపల్లి.. పాలమూరు ప్రాజెక్టుపై రాజకీయాలు చేస్తోంది మీరా? మేమా? అని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టును 80శాతం పూర్తి చేశామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. అబద్ధాలతోనే పాలన చేశారని, ప్రజలను మోసం చేశారని అన్నారు. హరీష్ వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని హరీశ్‌రావు చెబుతున్న మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రూ.80 వేల కోట్ల అంచనా వ్యయం ఉన్న ప్రాజెక్టులో కేవలం రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు ఎలా పూర్తి చేశారని నిలదీశారు. కనీసం కాలువల నిర్మాణం పూర్తి చేయలేదని, భూసేకరణ చేపట్టలేదని, పరిపాలనా అనుమతులు కూడా లేవని విమర్శించారు. ఎన్నికల ముందు హడావుడిగా పంపులు ఆన్ చేసి ప్రజలను వంచించారు తప్ప, ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరుపై రూ. 7 వేల కోట్లు ఖర్చు చేస్తే, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రూ. 8,300 కోట్లు వెచ్చించాయని గుర్తు చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ భూసేకరణలో భాగంగా 2.5 శాతం మంది రైతులకు మాత్రమే నష్టం వాటిల్లుతోందనని... కానీ 97.5 శాతం మంది రైతులకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు.

# పిచ్చి వాగుడు వాగితే ఖబర్దార్

- **అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లపై దుష్ప్రచారమా**
- **మండిపడ్డ మంత్రి సీతక్క**

**బలగం టీవీ, హైదరాబాద్**



అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. అంగన్వాడీ అంటే అమ్మఒడి అంటూ సీతక్క అభివర్ణించారు. మినీ అంగన్వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందని.. ఆ టీచర్లకు ఇప్పుడు రూ.2 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్లు కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు. అంగన్వాడీలకు గతంలో సెలవులు కూడా ఉండేవి కాదని.. కాంగ్రెస్ సర్కార్‌లో వారికి సెలవులు ఇస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీకి దక్కుతుందని ప్రశంసించారు. మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అంగన్వాడీ టీచర్లకు మంత్రి సీతక్క స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. స్మార్ట్ ఫోన్లు పంపిణీ సందర్భంగా తనపై వస్తున్న ఆరోపణలను సీతక్క ఖండించారు. తనపై కొంతమంది పిచ్చి వాగుడు వాగుతున్నారని ఆగ్రహించారు. అసత్య ప్రచారాలతో అబద్ధాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సెల్ ఫోన్ల కొనుగోలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆన్ లైన్ టెండర్లు వేసిందని.. ఎక్కడా అవినీతి జరగలేదన్నారు. కేంద్రం ఇచ్చిన గైడ్ లైన్ల ద్వారా మాత్రమే రూ.11,600 తక్కువ రేటుతో సెల్ ఫోన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం ఫోన్లు కొన్నది రూ.11 వేలకే అయితే రూ.14 వేలకు కొన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు సీతక్క.. పేదలకు మంచి చేసే తమ లాంటి వాళ్ల మీద చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్న వారికి లీగల్ నోటీసులు ఇస్తామని మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పని చేసినా గత ప్రభుత్వ పాలకులకు నిద్రపట్టడం లేదని విమర్శించారు. నిజాలు ఉంటే నిరూపించాలని, అంతేగాని బట్ట కాల్చి మీద వేస్తామంటే ఊరుకునే పరిస్థితి లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

# ఆటోకు మంగ్లీ ఎక్స్‌ప్రెస్ పేరు

**అభిమాని ప్రేమకు గాయని ఫిదా**

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలంగాణ జానపద గీతాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ప్రముఖ గాయని మంగ్లీ అభిమానుల మనసు గెలుచుకుంది. తాజాగా ఆమె ఓ అభిమానికి ఇచ్చిన సర్ప్రైజ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మంగ్లీకి వీరాభిమాని అయిన ఓ ఆటో డ్రైవర్ తన ఆటోకు 'మంగ్లీ ఎక్స్‌ప్రెస్' అని పేరు పెట్టి తన అభిమానాన్ని ప్రత్యేకంగా చూపించాడు. ఇదే ఆటోను రోడ్డుపై చూసిన మంగ్లీ, అతన్ని సర్ప్రైజ్ చేయాలని నిర్ణయించుకుంది. కొంత దూరం ఆ ఆటోను ఫాలో అయిన ఆమె, ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆ ఆటో డ్రైవర్ దగ్గరకు వెళ్లి పలకరించింది. అకస్మాత్తుగా తన అభిమాన గాయని ఎదురుగా రావడంతో ఆ ఆటోవాలా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మంగ్లీ అతనితో కలిసి సెల్ఫీ దిగడం, కాసేపు మాట్లాడడం ఆ అభిమానికి మరపురాని క్షణంగా మారింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను మంగ్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేస్తూ భావోద్వేగ పోస్ట్ పెట్టింది. 'ఈ రోజు నా మనసు ఎంతో కదిలిపోయింది. ఒక అభిమాని తన ఆటోపై నా పేరును 'మంగ్లీ ఎక్స్‌ప్రెస్'గా రాసుకోవడం చిన్న విషయం అనిపించినా, అది నాకు ఎంతో విలువైనది. ఆయనకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ప్రేమే నాకు ప్రేరణ' అంటూ రాసుకొచ్చింది.ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతూ, మంగ్లీ పెద్దమనసుకు నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. నడిరోడ్డుపై అభిమానితో కలిసిపోవడం ఆమె వినమ్రతను చాటిందని కామెంట్లు చేస్తున్నారు.

## కడప జిల్లాలో దారుణ ఘటన

**కీర్తన అనే విద్యార్థిని హత్య**

**బలగం టీవీ, కడప**

కడప జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మైదుకూరు సమీపంలోని ఖాజీపేట అగ్రహారంలో కీర్తన అనే విద్యార్థిని హత్యకు గురైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రేమోన్మాది దాడిగా భావిస్తున్న ఈ ఘటన ప్రజలను షాక్‌కు గురిచేసింది. పోలీసులు చెబుతున్న సమాచారం ప్రకారం, కీర్తనపై ఒక వ్యక్తి కత్తితో దాడి చేసి గొంతు కోసినట్లు అనుమానిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం కడపకు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి ఆంజనేయకొట్టాలు గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటన అనంతరం అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ఈ దారుణం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. అయితే, అసలు కారణాలు ఏమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా.. శిక్షలు పడుతున్నా.. ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి..

## డిజిపి ఎదుట లొంగిపోయిన కేశాలు

**మొత్తం 42 మంది ఆయుధాలతో లొంగుబాటు**

**వారికి పునరావాసం కల్పిస్తామన్న శివధర్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు అగ్రనేత, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ డిప్యూటీ కమాండర్ సోడిమల్ల కేశాలు లొంగిపోయారు. అతనితోపాటు మొత్తం 42 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. ఛత్తీస్‌గఢ్– తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల నుంచి వచ్చి వీరంతా లొంగిపోయారు. ములుగు, భూపాలపల్లి మీదుగా పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోతున్నట్లు ప్రకటించారు.అనంతరం సరిహద్దుల నుంచి పోలీసులు వీరిని వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించారు. మావోయిస్టు నేత హిడ్మా గెరిల్లాను వదిలి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి వెళ్లిన తర్వాత బెటాలియన్ బాధ్యతలను బడ్సే దేవాకు, కేశాలుకు అప్పగించారు. అయితే, కొన్ని రోజులు కిందటే కమాండర్ దేవా.. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుపోయారు. ఆ తర్వాత బెటాలియన్ బాధ్యతలు నిర్వహిస్తున్న సోడిమల్ల కేశాలు సైతం తాజాగా శుక్రవారం లొంగిపోయారు. ఇతనికి సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ వంటి పేర్లున్నాయి. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు.మొత్తం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో గెరిల్లా బెటాలియన్ కమాండర్ సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ ఉన్నారని వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలు, బంగారంతో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. 36 తుపాకులు, ఐదు ఏకే 47లు, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, 1,007 తూటాలతో పోలీసులు ముందు మావోలు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. అలాగే 800 గ్రాముల బంగారం సైతం అప్పగించినట్లు వెల్లడించారు. వీరి లొంగుబాటుతో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పూర్తిగా కనుమరుగైనట్లు డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు.గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా డీజీపీ ఎదుట లొంగిపోయారు. వీరిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ కేశాలు కూడా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ పెరగడంతో మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందివారు కాగా.. ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. 'లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీ కింద రూ.1.93 కోట్లు అందజేస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్యకార్డులు అందజేస్తాం. తెలంగాణకు చెందిన వాళ్ల సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరున్నారు. స్టేట్ కమిటీలో తెలంగాణ వాళ్లు 24 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరే ఉన్నారు. వాళ్లు కూడా లొంగిపోవాలని పిలుపునిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు.

# యోగాను జీవన విధానంగా మార్చుకోవాలి..

- ఆరోగ్య సాధనకు యోగా ఒక వరం
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని, అప్పుడే సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆయుష్ విభాగం ఇతర శాఖల సంయుక్త భాగస్వామ్యంతో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం యోగా గురువు యోగాసనాలు వేయించి, ధ్యానం చేయించారు ధ్యానం, యోగాసనాలతో కలిగే లాభాలను వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత మార్చి 6వ తేదీన ప్రారంభించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా జూన్ 12 వరకు జిల్లావ్యాప్తంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా రోగ నిర్ధారణ పరీక్షలు, వైద్య శిబిరాలు మరియు అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహిస్తున్నామని అన్నారు . మన దేశం ప్రపంచానికి అందించిన పతంజలి యోగా విశిష్టతను గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరూ రోజుకు అరగంట నుండి గంట సమయం పాటు వ్యాయామం, యోగా సాధన చేయాలని కోరారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఇది రోజువారీ వృత్తి నిర్వహణలో పనితీరును మెరుగుపరుస్తుందని వివరించారు. ఎన్నో శారీరక రుగ్మతలు కేవలం యోగాసనాలు, ధ్యానం ద్వారానే నయమవుతాయని, యోగా అనేది ఒక వ్యాయామం మాత్రమే కాదని, అది ఒక ఉన్నతమైన జీవన విధానమని పేర్కొన్నారు.?యోగా నేర్చుకోవాలనుకునే వారి కోసం ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఎన్నో వీడియోలు, గురువులు అందుబాటులో ఉన్నారని, అదేవిధంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్ కేంద్రాల్లో కూడా ప్రత్యేక శిక్షణ మరియు అవగాహన కల్పిస్తారని తెలిపారు. వైద్యులు సైతం మందులతో పాటు యోగా, ప్రాణాయామం యొక్క ప్రాముఖ్యతను గుర్తిస్తున్నారని అన్నారు . అనంతరం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌ను మరియు ఇతర ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, డీవైఎస్ఓ రాందాస్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.





# ముగ్గురి మరణానికి కారణమైన నిందితుడి అరెస్ట్..

- 14 ఏళ్లుగా పరారీలో ఉన్న నిందితుడి రిమాండ్
- ఎస్పీ మహేష్ బి. గితే.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

భార్య, ఇద్దరు చిన్నారుల ఆత్మహత్యకు కారణమై, గత 14 ఏళ్లుగా పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినామని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ ?ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లి గ్రామానికి చెందిన బోయిని ఆంజనేయులు, 2007లో భాగ్యలక్ష్మిని వివాహం చేసుకోగా, వీరికి శ్రీనిధి (5), నైపున్య (2) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 2012లో భాగ్యలక్ష్మి మూడవసారి గర్భవతిగా ఉన్న సమయంలో, మళ్లీ ఆడపిల్ల పుడుతుందనే అనుమానంతో భర్త ఆంజనేయులు, అత్తమామలు ఆమెను శారీరకంగా, మానసిక వేధింపులకు గురిచేశారు. భర్త వేధింపులను తట్టుకోలేక భాగ్యలక్ష్మి తన ఇద్దరు బిడ్డలతో కలిసి ఆత్మహత్య చేసుకుంది.?ఈ ఘటనపై 2012లో కేసు నమోదైనప్పటి నుండి ఆంజనేయులు పోలీసులకు దొరకకుండా పరారీలో ఉన్నాడు. దీంతో న్యాయస్థానం అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిందని అన్నారు. భాగ్యలక్ష్మి తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు చేయగా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి, అదుపులోకి తీసుకొని,నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించిందని తెలిపారు.నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ నటేష్, ముస్తాబాద్ ఎస్.ఐ గణేష్, మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

**పోలీసులకు బాధితురాలి తల్లి కృతజ్ఞతలు..**

తన 14 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కిందని, ఫిర్యాదు చేసిన మూడు రోజుల్లోనే నిందితుడిని పట్టుకున్న జిల్లా ఎస్పీ గారికి, పోలీసు బృందానికి కన్నీటిపర్యంతమై కృతజ్ఞతలను ఎల్లవ్వ తెలిపారు.



# చౌక ధరల దుకాణంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్ నగర్ లో ఉన్న చౌక ధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ చేసి.. ఆన్లైన్ లో లబ్దిదారుల వివరాల నమోదు .. సన్న బియ్యం పంపిణీని పరిశీలించారు. ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేయాలని ఇప్పటికే అన్ని చౌక ధరల దుకాణాలకు అందించింది. ఈ సందర్భంగా పలువురు రేషన్ కార్డుల లబ్ధిదారులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఇప్పటిదాకా ఎందరు లబ్ధిదారులు సన్న బియ్యం తీసుకువెళ్ళారు? పంపిణీలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రేషన్ డీలర్ ను జిల్లా ఆరా తీశారు. పరిశీలనలో సిరిసిల్ల డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# విద్యార్థులతో కలిసి.. అల్పాహారం తిన్న కలెక్టర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం విద్యార్థులకు అల్పాహారం ఇచ్చే సమయం కావడంతో జిల్లా కలెక్టర్ ముందుగా మెనూ చార్ట్ పరిశీలించారు. నేరుగా డైనింగ్ రూమ్ వద్దకు చేరుకొని.. ప్లేట్ తీసుకుని విద్యార్థులతో కలిసి టిఫిన్ చేశారు.మెనూ ప్రకారం భోజనం, ఇతర ఆహార పదార్థాలు ఇస్తున్నారా అని ఆరా తీశారు. వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. చదవడం, రాయడం, ప్రణాళిక సిద్ధం చేసుకోవడం తదితర అంశాలపై విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచనలు చేశారు. మంచిగా చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.






# ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉచిత ఆయుర్వేద ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ?ఈ కార్యక్రమాన్ని డిఎంహెచ్వో డాక్టర్ రజిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానం ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేసుకోవచ్చని తెలిపారు. ప్రకృతి సిద్ధమైన ఆయుర్వేద మందుల పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని, ఈ శిబిరం ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను బాధితులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో జీవనశైలి మార్పుల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదం చక్కని పరిష్కారమని అన్నారు.?ఈ కార్యక్రమంలో పట్టణ వైద్యాధికారి డాక్టర్ రేఖ, జిల్లా డేటా మేనేజర్ కార్తీక్, వివిధ విభాగాల ఆయుష్ వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


# యువతను క్రీడా శిఖరాలుగా మార్చేందుకే కేసీఆర్ కప్..



**-గంభీరావుపేటలో ఘనంగా కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో 'కేసీఆర్ కప్' క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నామని నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు.గంభీరావు పేట మండల కేంద్రం లో కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ను నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా, గ్రామీణ స్థాయి క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవడానికి ఒక గొప్ప అవకాశమని,యువత ఈ టోర్నమెంట్‌ను సద్వినియోగం చేసుకుని క్రీడా రంగంలో రాణించాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం యువతకు ఎంతో అవసరమని, క్రీడలు క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ టోర్నీలో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు లభించే అవకాశం ఉందని అన్నారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా తమ కెరీర్‌ను కూడా నిర్మించుకోవచ్చని అన్నారు. మండలస్థాయిలో ప్రథమ బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.20వేలు, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రూ. 2 లక్షలు, రెండో బహు మతి రూ.లక్ష చొప్పున ఇవ్వ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారా యణ రావు, బిఆర్ ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్ స్వామి గౌడ్,బిఆర్ ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజు, ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి,బిఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్ యాదవ్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బాలరాజు గౌడ్, నాయ కులు కుంబాల మల్లా రెడ్డి, దయాకర్ రావు, రాజారాం, మల్లే శం యాదవ్, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# విదేశీ ఉద్యోగ మాయలో కంబోడియాలో చిక్కుకున్న యువకుడు

**-భర్తను స్వదేశానికి తీసుకురావాలని భార్య వినతి**

**-సీఎం ప్రవాసీ ప్రజావాణిలో పిటిషన్**

**బలగం టీవీ, హైదరాబాద్**

సోషల్ మీడియాలో వచ్చిన విదేశీ ఉద్యోగ ప్రకటనకు ఆకర్షితుడై కంబోడియా వెళ్లిన ఓ యువకుడు అక్కడే చిక్కుకుని దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నాడు. నెలకు రూ.70 వేల జీతం వస్తుందనే ఆశతో వెళ్లిన అతడు ప్రస్తుతం తిండికి, వసతికి కూడా ఇబ్బందులు పడుతూ స్వదేశానికి రావడానికి ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు.

వివరాల్లోకి వెళ్తే, జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం చిన్న మెటుపల్లికి చెందిన దువ్వాక రాజేష్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం కోసం కంబోడియా వెళ్లాడు. అయితే అక్కడికి వెళ్లిన తరువాత సైబర్ నేరగాళ్ల ముఠా చేతిలో బందీ అయ్యాడు. ఎలాగోలా వారి చెర నుంచి బయటపడినప్పటికీ ప్రస్తుతం తీవ్ర ఇబ్బందుల్లో జీవిస్తున్నాడు. భారత్‌కు తిరిగి రావాలంటే సుమారు రూ.1.20 లక్షలు ఖర్చవుతుందని కంబోడియాలోని భారత రాయబార కార్యాలయం తెలిపినట్లు సమాచారం. దీంతో తన భర్తను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని అతని భార్య ప్రవళిక రాణి వేడుకుంటోంది.

ఈ మేరకు ఆమె శుక్రవారం హైదరాబాద్ బేగంపేటలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించింది. అలాగే తెలంగాణ ప్రభుత్వం నియమించిన ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీం రెడ్డికి కూడా ఫిర్యాదు ప్రతిని అందజేసింది. ఇక ఈ విషయాన్ని అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ ఇప్పటికే ఏప్రిల్ 4న 'మదద్' పోర్టల్‌లో నమోదు చేసి, భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో పాటు కంబోడియాలోని భారత రాయబార కార్యాలయ దృష్టికి తీసుకెళ్లింది. యువకుడిని సురక్షితంగా భారత్‌కు తీసుకురావాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# భూ భారతి, సాదాబైనామా అర్జీలను వెంటనే పరిష్కరించాలి



**-నిరుపయోగ రెవెన్యూ భూముల్లో 'డీమ్డ్ ఫారెస్ట్' అభివృద్ధి..**

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భూభారతి, సాదా బైనామా అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భూ భారతి, సాదాబైనామా, వెట్ ల్యాండ్స్, డీమ్డ్ ఫారెస్ట్ అంశాలపై రెవెన్యూ, అటవీ శాఖ, నీటి పారుదల, సర్వే అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సము దాయంలో శుక్రవారం జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. భూ భారతి, సాదాబైనామా కింద వచ్చిన అర్జీలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాలు, రెండు మున్సిపాలిటీల పరిధిలో ఉన్న చెరువులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు వెట్ ల్యాండ్స్ కిందకు వస్తాయని అన్నారు . రెవెన్యూ అధికారులు, సర్వే శాఖ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా చెరువులు ఏ సర్వే నంబర్ లో ఉన్నాయి? వాటి విస్తీర్ణం, వాటి సరిహద్దులు గుర్తించాలని ఆదేశించారు. గ్రామాల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన నిరుపయోగ భూముల్లో డీమ్డ్ ఫారెస్ట్ కింద అటవీ శాఖ అధికారులు అభివృద్ధి చేస్తారని అన్నారు . తహసీల్దార్లు తమ పరిధిలోని చౌక ధరల దుకాణాలను తనిఖీ చేయాలని, త్వరలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తనిఖీ చేసి ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, జిల్లా సర్వే అధికారి శ్రీనివాస్, నీటి పారుదల శాఖ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యమైన విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యం..

**- డి.ఈ అంజయ్య**

**బలగం టీవీ,గంభీరావుపేట:**

వినియోగదారులకు నాణ్యమైన మరియు అంతరాయం లేని విద్యుత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సిరిసిల్ల విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ అంజయ్య అన్నారు . గంభీరావుపేట మండలంలోని భీముని మల్లారెడ్డిపేట గ్రామంలో నూతనంగా మంజూరైన సబ్‌స్టేషన్ నిర్మాణానికి శుక్రవారం డి.ఈ అంజయ్య అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ?అనంతరం డి.ఈ అంజయ్య మాట్లాడుతూ, రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ లోడ్‌ను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తు అవసరాలకు ఇబ్బంది కలగకుండా ఈ నూతన సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నమని అన్నారు . దీనివల్ల భీముని మల్లారెడ్డిపేట గ్రామంతో పాటు పరిసర గ్రామాలైన శ్రీ గాద, రామానుజపూర్ వాసులకు లో–వోల్టేజ్ సమస్యలు తొలగిపోతాయని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందని అన్నారు . ఎన్పీడీసీఎల్ ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు . ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్, ఏఈ ఆనంద్, గంభీరావుపేట డైరెక్టర్ జి. నారాయణరావు, సర్పంచ్ మహేష్, ఉపసర్పంచ్ బాబు, మాజీ ఎంపీటీసీ రాజేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శెట్టి రవి శెట్టి రవి, విలేజ్ అసిస్టెంట్ హెల్పర్ వెంకట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే కవ్వంపల్లి కి కానరాని ఆ గ్రామాలు

**అసలు నువ్వు ఆ గ్రామాలకు ఎమ్మెల్యే కదా కవ్వంపల్లి**

**మానకొండూర్ మాజి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి.**

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని కొన్ని గ్రామాలకు మాత్రమే ఎమ్మెల్యే కానీ అన్ని గ్రామాలకు కదా కవ్వంపల్లి అని మానకొండూర్ నియోజకవర్గం మాజి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ఏద్దెవా చేసారు. శుక్రవారం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడుతూ ఇల్లంతకుంట మండలంలో 35 గ్రామాలకు నిధుల కేటాయింపు విషయం లో 24 పంచాయతీ లకు మాత్రమే నిధులు ఇచ్చి మిగతా 11 గ్రామాలకు మొండి చేయి చూపడం పట్ల అంతర్యం ఏంటని తీవ్రంగా ధ్వజమెత్తారు.బియర్ఎస్ పార్టీ సర్పంచ్ లు ఉన్న గ్రామ పంచాయతీ ల్లో ఇక నుండి నిన్ను తిరగకుండా అడ్డుకుంటామని నువ్వు చూపిన వివక్ష కు తగిన గుణపాఠం చెప్పుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సర్పంచ్ లు మరిజె మోహన్ రావు, వికృతి స్నేహ లక్ష్మరెడ్డి,కముటమ్ లావణ్య రాములు,రడం లక్ష్మీ ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య యాదవ్, సావనపల్లి వనజ అనీల్, ఎం.డి సాదుల్, బీఆర్ఎస్ నాయకులు ఆరే కొమురయ్య, తూటి పర్శరాం,శ్రీనివాస్ రెడ్డి, అల్వాల రాజేశం, పండుగ భాస్కర్, ర్యాగటి రమేష్, ఎడ్ల ప్రశాంత్ రెడ్డి,సత్యం, గడ్డం తిరుపతి, దయ్యాల మహేష్, సంతోష్ రెడ్డి, తిరుపతి రెడ్డి, తిరుపతి రావు, కూనబోయిన రఘు, రాజారాం తదితరులు పాల్గొన్నారు

# ఇసుక బుకింగ్‌లకు ఇక ఆన్‌లైన్ విధానం...



- **మన ఇసుక వాహనం'తో ఇసుక విక్రయాల్లో పారదర్శకత..**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాష్ట్రవ్యాప్తంగా ఇసుక తరలింపులో పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ విధానాన్ని గృహ మరియు ప్రభుత్వ నిర్మాణదారులు వినియోగించుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానం, మొబైల్ అప్లికేషన్, ఇసుక బుకింగ్స్ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మైనింగ్ అధికారి, తహసీల్దార్లు, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారితో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన వెబ్‌సైట్ మరియు మొబైల్ అప్లికేషన్ ద్వారా జిల్లాలోని 15 ఇసుక రీచ్‌ల నుండి ఇసుకను సులభంగా బుక్ చేసుకోవచ్చని అన్నారు .?గతంలో ఉన్న నేరుగా కూపన్లు ఇచ్చే విధానాన్ని రద్దు చేసి, ప్రస్తుత ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తెచ్చామని అన్నారు . ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణదారులు సంబంధిత అధికారి ధ్రువీకరణ పత్రాన్ని, సొంత ఇళ్ల నిర్మాణదారులు పంచాయతీ లేదా మున్సిపల్ అనుమతి పత్రాలను, మరియు ప్రభుత్వ పనుల కాంట్రాక్టర్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జారీ చేసిన అనుమతి పత్రాలను ఆన్‌లైన్‌లో జత చేయాలని అన్నారు . వినియోగదారుల సౌకర్యార్థం 040-23120421, 83339 23732 టోల్ ఫ్రీ నంబర్లతో పాటు ష్టవశ్రీజూనవంన్.ంఎఱజఎష్త్రస్త్ర.స్త్రశీఙ.ఱఅ మెయిల్ ఐడీని కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.?అధికారులు తమ లాగిన్‌లోకి వచ్చే బుకింగ్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ పనుల ఇంజనీర్లు తమ నిర్మాణ పనులకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు .ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి కుమార్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## 26వ తేదీ నుంచి స్వీయ గణన..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



ఈ నెల 26వ తేదీ నుంచి స్వీయ గణన ప్రక్రియ మొదలు కానున్నదని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జన గణన 2027లో భాగంగా మొదటి దశ ఇండ్ల గణనపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రాష్ట్ర జనాభా గణన కార్యాలయము జేడీ సుబ్బరాజు, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పలు శాఖల అధికారల తో శుక్రవారం ప్రిన్సిపల్ గణన అధికారి, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ నెల 26 వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు స్వీయ గణన జిల్లాలో నిర్వహించనున్నామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది జిల్లాలోని ప్రజాప్రతినిధులు స్వీయ గణన చేసుకోవాలని పేర్కొన్నారు.సర్పంచులు, కౌన్సిలర్ లు, వార్డు మెంబర్ లు, ఇతర ప్రభుత్వ/ ప్రైవేట్ ఉద్యోగులు వారి మొబైల్ ఫోన్ల ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.జనాభా గణన మొదటి దశకు సంబంధించి శిక్షణ తరగతులు ఈ నెల 20 వ తేదీ నుంచి నిర్వహించనున్నారని అన్నారు . సీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా హౌస్ లిస్టింగ్ బ్లాక్ క్రియేషన్, కార్వింగ్ ఈ నెల 11వ తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 16 వ తేదీన జిల్లాలో ఇప్పటికే ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లుగా నియమించిన వారికి సంబంధించిన ఉత్తర్వుల కాపీలు, గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు. శిక్షణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, సరైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఈ సమావేశంలో జన గణన జిల్లా ఇంచార్జి తిరుపతి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, ముఖ్య ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని గంభీరావుపేట బ్రిడ్జి పనులు..



**-బ్రిడ్జి నిర్మాణంలో జాప్యంపై బీజేపీ ధర్నా**

**బలగం టీవీ, గంభీరావుపేట :**

గంభీరావుపేట లింగన్నపేట ల మధ్య వాగుపై వరకు నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు కోడె రమేశ్ మాట్లాడుతూ, మూడు జిల్లాలకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ మార్గంలో బ్రిడ్జి నిర్మాణం నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కేటీ రామారావు అభివృద్ధిని గాలికొదిలేసి, కేవలం మాటలకే పరిమితమయ్యారని అన్నారు .ఏళ్లు గడుస్తున్నా పనుల్లో పురోగతి లేకపోవడం వల్ల వర్షాకాలంలో రాకపోకలు స్తంభించి రైతులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని,అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి వచ్చిందని అన్నారు.బ్రిడ్జి పనులను వెంటనే యుద్ధప్రాతిపదికన ప్రారంభించి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున రాస్తారోకోలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు వాసిద్ హుస్సేన్, మండల ప్రధాన కార్యదర్శులు మల్లేష్ యాదవ్, విగ్నేష్ గౌడ్, ఉపాధ్యక్షులు మోహన్, నర్సింలు, రాజుతో పాటు సీనియర్ నాయకులు డాక్టర్ సత్యనారాయణ, శ్రీనివాస్, దేవేందర్ గౌడ్, దేవేందర్ యాదవ్, రాకేష్, ఎం. శ్రీనివాస్, తిరుపతి, దుర్గేష్, ఎల్లం, రవీందర్ నాయక్, రాజు, నరేష్, మల్లేష్ గౌడ్, శ్రీనివాస్ చారి, గణేష్, సుర రమేష్ మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంజాయి తాగుతూ ముగ్గురు అరెస్ట్.. డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు.

**- డిఎస్పి నాగేంద్ర చారి..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని కే-కన్వెన్షన్ హాల్ సమీపంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి,డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించినామని సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని డీఎస్పీ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణము కు చెందిన మహమ్మద్ సద్దాం, ఎంబేరి ఆకాష్ మరియు మరో బాలుడు మహారాష్ట్రలోని నాందేడ్ నుండి గంజాయిని తెప్పించుకుని కే-కన్వెన్షన్ హాల్ సమీపంలో తాగుతున్నారని సమాచారం రాగ తనిఖీలు చేపట్టామని అన్నారు.నిఖీల్లో పట్టుబడిన వీరికి గంజాయి కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించగా, పాజిటివ్ నిర్ధారణ అయ్యిందని, వారిపై నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, తాము ఈ వ్యసనం నుండి బయటపడతామని, చికిత్స తీసుకుంటామని నిందితులు స్వచ్ఛందంగా కోరాగా, కోర్టు అనుమతితో వారిని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించామని అన్నారు. ఇక్కడ టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.




## ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలి..



**-రోడ్డు భద్రతపై ఏప్రిల్ 13 నుండి 18 వరకు ప్రత్యేక కార్యాచరణ**

**-రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలి..**

**-ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**


రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని ఎస్పీ మహేష్ బి.గితే అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 13 నుంచి 18 వరకు నిర్వహించే కార్యక్రమాలపై ఎస్పీ మహేష్ బి.గితే పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి,దిశానిర్దేశం చేశారు.

?ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ, గ్రామ మరియు పట్టణ స్థాయిలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, అక్కడ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని వాహనదారులతో ట్రాఫిక్ నిబంధనల పాటనపై ప్రతిజ్ఞ చేయించాలని, విద్యార్థులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను వివరిస్తూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు .?రోడ్డు నిబంధనలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రమాద సమయాల్లో బాధితులకు తక్షణ సహాయం అందించేలా 'గోల్డెన్ అవర్ రెస్పాన్స్'పై పోలీస్, అంబులెన్స్ సిబ్బందితో పాటు వాలంటీర్లకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. కేవలం జరిమానాలు విధించడమే లక్ష్యం కాకుండా, ఉల్లంఘనదారులకు కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా మార్పు తీసుకురావాలన్నారు.?అదేవిధంగా జిల్లాలో రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. వారిని పోలీస్ స్టేషన్లకు పిలిపించి సత్ప్రవర్తనతో మెలగాలని కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. నేర ప్రవృత్తిని వీడి సాధారణ జీవితం గడుపుతున్న వారిని గుర్తించి, వారిపై ఉన్న షీట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాస్, పలువురు సీఐలు, ఎస్సైలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రూ. 2.81 కోట్లతో సిరిసిల్లలో కొత్త సబ్‌స్టేషన్..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

సిరిసిల్ల పట్టణ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కలెక్టరేట్ బైపాస్ రోడ్డులో రూ. 2.81 కోట్లతో కొత్తగా 33/11ఖఎ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసినట్లు ఎస్ఈ. బేతి బిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈ. బేతి బిక్షపతి మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా, 5.0 వీఏా ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు నాలుగు కొత్త ఫీడర్లను ఇక్కడ నిర్మించనున్నామని, ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే సిరిసిల్ల మండలంలోని వేలాది మందికి లో-ఓల్టేజీ సమస్యలు తొలగి, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందుతుందని పేర్కొన్నారు.



## పేదల ఆరోగ్యానికి భరోసా ముఖ్యమంత్రి సహాయనిధి..

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

నిరుపేదల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వేములవాడ రూరల్ మండలానికి చెందిన లబ్ధిదారులకు చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా మండల పరిధిలోని మొత్తం 54 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ. 17 లక్షల 85 వేల విలువైన సహాయనిధి చెక్కులను స్వయంగా అందజేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. అనారోగ్యం బారిన పడి భారీగా వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బంది పడుతున్న పేదలకు ఈ నిధి ఒక వరమని అన్నారు . ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. .



## తాగునీటి కోసం దోసలగూడెం వాసుల రాస్తారోకో..

**బలగం టీవీ, గంభీరావుపేట :**

గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసలగూడెం కాలనీలో గత వారం రోజులుగా తాగునీరు రాకపోవడంతో దోసల గూడెం కాలనీవాసులు కామారెడ్డి-సిద్దిపేట ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం మాట్లాడుతూ, వెయ్యి మంది జనాభా ఉన్న కాలనీలో నీటి సమస్య నెలకొన్నా సర్పంచ్, వార్డు మెంబర్లు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గత బిఆర్ఎస్ పభుత్వ హయాంలోనూ ఈ ప్రాంతానికి అన్యాయమే జరిగిందని, ప్రస్తుత పాలకులు కూడా మాలల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు.నీరు ఉన్న చోట బోర్లు వేస్తూ, అవసరమున్న చోట నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు . సమర్థవంతంగా పనిచేసే సిబ్బందిని తొలగించి, ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, దోసలగూడెంను దత్తత తీసుకుని తమ నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోజాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా అధికార ప్రతినిధి మద్దెల రాజనర్సు, నాయకులు పిట్ల రఘు, ప్రవీణ్ కుమార్, చక్రధర్, వంశీ, కిషన్,జీడి అనంతరాములు, శివాజీ మరియు మహిళలు పాల్గొన్నారు.




## ఆపదలో ఉన్న విద్యార్థినికి అండగా మహర్షి హైస్కూల్...

**- రూ. 55 వేల ఆర్థిక సాయం...**

**- పవర్‌లూమ్ కార్మికుడి బిడ్డకు ప్రాణదానం.. విరాళాలు సేకరించి అప్పగించిన తోటి విద్యార్థులు...**

**- ఉచిత విద్యను ప్రకటించిన పాఠశాల యాజమాన్యం...**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని మహర్షి హైస్కూల్ యాజమాన్యం మరియు విద్యార్థులు గొప్ప మానవత్వాన్ని చాటుకున్నారు. తమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న అంబటి సహస్ర అనే విద్యార్థిని ప్రాణాలను కాపాడుకునేందుకు అంతా ఏకమై అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. అంబటి వేణు కుమార్తె సహస్ర గత కొంతకాలంగా తీవ్రమైన కాలేయ (లివర్) సంబంధిత వ్యాధితో బాధపడుతోంది.ఈ క్రమంలో లివర్ మార్పిడి ఒక్కటే పరిష్కారమని వైద్యులు సూచించారు.అయితే ఇందుకు సుమారు 20 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని చెప్పడంతో, సాధారణ పవర్ లూమ్ కార్మికుడైన వేణు తన ఆర్థిక స్తోమత చాలక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ఈ విషయం తెలుసుకున్న మహర్షి హైస్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు మానవతా దృక్పథంతో విరాళాలు సేకరించారు. సేకరించిన 55 వేల రూపాయల నగదును శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో అంబటి వేణుకు అందజేశారు. ఈ నగదుతో పాటు, సహస్రకు వచ్చే విద్యా సంవత్సరం ఎటువంటి ఫీజులు తీసుకోకుండా పూర్తి ఉచితంగా విద్యను అందిస్తామని పాఠశాల యాజమాన్యం ప్రకటించింది. ప్రస్తుతం సహస్రకు లివర్ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బూర శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్వేత, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కష్టకాలంలో ఆదుకున్న స్కూల్ బృందానికి సహస్ర కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## కొండాపూర్ చౌడలమ్మ జాతరలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలో చౌడలమ్మ జాతర మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు..?జాతర సందర్భంగా ఆలయానికి చేరుకున్న అది శ్రీనివాస్ కి , గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అది శ్రీనివాస్ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆ అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.



# అరుంధతి చౌదరికి స్వర్ణం

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత క్రీడారంగంలో మరో ధ్రువతార మెరిసింది. అడ్డంకులు ఎన్ని ఎదురైనా, సంకల్పం బలంగా ఉంటే విజయం వరిస్తుందని రాజస్థాన్‌కు చెందిన బాక్సర్ అరుంధతి చౌదరి నిరూపించారు. మంగోలియాలోని ఉలాన్‌బాటర్ వేదికగా జరిగిన ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని దేశ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటారు. ముఖ్యంగా మూడేళ్ల పాటు గాయంతో పోరాడి, రింగుకు దూరమైన తర్వాత ఆమె సాధించిన ఈ విజయం క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తినిస్తోందనే చెప్పాలి. అరుంధతి గెలుపుతో ఆమె స్వగ్రామమైన కోటలో పండుగ వాతావరణం నెలకొంది. మంగోలియాలో జరుగుతున్న ఆసియా బాక్సింగ్ ఎలైట్ ఛాంపియన్‌షిప్‌లో అరుంధతి చౌదరి అద్భుతమైన ఫామ్‌ను కనబరిచారు. గురువారం 70 కేజీల ఫైనల్ మ్యాచ్‌లో ఆమె ప్రత్యర్థి బక్త్? సెడిష్? (కజకిస్థాన్?)పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి 4–1 స్కోరుతో ఘనవిజయం సాధించారు. కజకిస్థాన్ వంటి బలమైన దేశాల నుంచి వచ్చిన బాక్సర్లను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడటం సామాన్యమైన విషయం కాదు. నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గోహైన్ వంటి వరల్డ్ ఛాంపియన్లతో కూడిన భారత జట్టులో అరుంధతి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.అరుంధతి ప్రయాణం పూల బాట ఏమీ కాదు. మణికట్టుకు తీవ్రమైన గాయం కావడంతో ఆమె దాదాపు మూడేళ్ల పాటు బాక్సింగ్ రింగుకు దూరమయ్యారు. ఈ క్రమంలో ముంబయిలో ఆమెకు రెండు సార్లు శస్త్రచికిత్సలు జరిగాయి. వైద్యుల పర్యవేక్షణలో ఉంటూ మానసిక ధైర్యాన్ని కోల్పోకుండా ఆమె చేసిన పోరాటాన్ని ఆమె తండ్రి సురేష్ చౌదరి వనవాసంతో పోల్చారు. గాయం నుంచి కోలుకున్న కేవలం ఆరు నుంచి ఎనిమిది నెలల కాలంలోనే ఆమె మళ్లీ ఫామ్?లోకి రావడం విశేషం. పట్టుదలే ఆమెను మళ్లీ ఛాంపియన్‌గా మార్చింది.అరుంధతి స్వర్ణం గెలిచిన వార్త తెలియగానే కోటలోని ఆమె నివాసం వద్ద కోలాహలం మొదలైంది. ఈ విజయం గురించి ఆమె తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. "నా కూతురు రాజస్థాన్‌కు మాత్రమే కాదు, దేశం మొత్తానికి గర్వకారణంగా నిలిచింది" అని తండ్రి సురేష్ చౌదరి ఆనందం వ్యక్తం చేశారు. ఆసియా స్థాయిలో ఇంతటి పోటీని ఎదుర్కొని గెలవడం గర్వంగా ఉందన్నారు. ఆమె తల్లి సునీతా చౌదరి మాట్లాడుతూ నేటి కాలంలో కుమారుల కంటే కుమార్తెలే దేశానికి ఎక్కువ కీర్తిని తీసుకువస్తున్నారని గర్వంగా చెప్పారు.అరుంధతి గత కొద్దికాలంగా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. నోయిడాలో జరిగిన వరల్డ్ కప్‌లో స్వర్ణం గెలిచిన ఆమె, ఆ తర్వాత స్పెయిన్‌లో జరిగిన 'బాక్సామ్' ఇంటర్నేషనల్ టోర్నీలో 70 కేజీల విభాగంలో పసిడి పతకాన్ని సాధించారు. ఇప్పుడు ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కూడా అదే జోరును కొనసాగించి తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు. సెమీఫైనల్ అలాగే ఫైనల్ మ్యాచ్‌లలో ఆమె చూపిన తెగువ చూస్తుంటే, రాబోయే పెద్ద టోర్నీలకు ఆమె పవర్ఫుల్?గా సిద్ధమైనట్లు అర్ధమవుతుంది.అరుంధతి కోచ్ అశోక్ గౌతమ్ ఆమె సాధించిన విజయాన్ని కొనియాడారు. "ఈ టోర్నీలో ప్రపంచస్థాయి బాక్సర్లు పాల్గొన్నారు. ఇక్కడ స్వర్ణం గెలుచుకోవడం అంటే దాదాపు వరల్డ్ కప్ గెలిచినట్లే" అని అభిప్రాయపడ్డారు. నిఖత్ జరీన్, లవ్లీనా వంటి దిగ్గజాల సమక్షంలో అరుంధతి ఇంతటి ప్రదర్శన చేయడం ఆమె ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందన్నారు. ఆమెలోని టెక్నిక్ స్పీడ్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయని వివరించారు. ఆసియా టైటిల్ సాధించిన తర్వాత అరుంధతి విశ్రాంతి తీసుకోవాలని అనుకోవడం లేదు. త్వరలోనే ఆమె కోటకు చేరుకుని, ఆ తర్వాత గ్లాస్గోలో జరగబోయే కామన్వెల్త్ గేమ్స్ కోసం సిద్ధం కానున్నారు. దీనికోసం ఆమె ఉజ్బెకిస్థాన్ లేదా అమెరికాలో ప్రత్యేక శిక్షణ తీసుకునే అవకాశం ఉంది. అరుంధతి నెక్స్ట్ టార్గెట్ ఒలింపిక్స్‌లో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడమే. తన ఆరోగ్య సమస్యలను, ముఖ్యంగా శ్వాసకోశ ఇబ్బందులను అధిగమిస్తూ ఆమె సాగిస్తున్న ఈ ప్రయాణం తప్పక ఒలింపిక్ పతకం వైపు తీసుకెళ్తుందని ఆమె కుటుంబం నమ్ముతోంది. అరుంధతితోపాటు ప్రీతి పవార్ (54 కేజీ), ప్రియ (60 కేజీ), మీనాక్షి హుడా (48 కేజీ) గోల్డ్ మెడల్స్ సాధించారు. హువాంగ్ (చైనీస్ తైపీ)పై 5– 0 తేడాతో ప్రీతి నెగ్గగా, 5– 0 తేడాతోనే నోమన్‌దరి (మంగోలియా)పై మీనాక్షి విజయం సాధించింది. ఇక 3– 0 తేడాతో వాన్ యంగ్ (ఉత్తర కొరియా)పై ప్రియ గెలుపొంది స్వర్ణం ముద్దాడింది.

## క్రికెట్ లోని వింత రూల్ పై ఫ్యాన్స్ ఫైర్!

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో బుధవారం జరిగిన గుజరాత్ టైటాన్స్ , ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ క్రికెట్ ప్రపంచంలో ఒక పెద్ద చర్చకు తెరలేపింది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో గుజరాత్ టైటాన్స్ కేవలం ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. ఆఖరి బంతికి 2 పరుగులు కావాల్సిన సమయంలో కుల్దీప్ యాదవ్ రనౌట్ కావడంతో ఢిల్లీ ఓటమి పాలైంది. అంతకుముందు బంతికి డేవిడ్ మిల్లర్ సింగిల్ తీయడానికి నిరాకరించడం కూడా జట్టు కొంపముంచింది. అయితే, ఈ ఓటమి కంటే కూడా మ్యాచ్ మధ్యలో జరిగిన ఒక సంఘటన ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అంపైర్ చేసిన ఒక చిన్న పొరపాటు వల్ల ఢిల్లీకి రావాల్సిన ఒక పరుగు రాకుండా పోవడమే దీనికి కారణం. ఢిల్లీ ఇన్నింగ్స్ 10వ ఓవర్‌లో రషీద్ ఖాన్ బౌలింగ్‌లో నితీష్ రాణా ప్యాడ్లకు బంతి తగిలింది. అంపైర్ ఎల్బీడబ్ల్యూ గా భావించి వేలు పైకెత్తారు. అంపైర్ నిర్ణయం రాకముందే బ్యాటర్లు ఒక పరుగు పూర్తి చేశారు. నితీష్ రాణా వెంటనే రివ్యూ తీసుకోగా, థర్డ్ అంపైర్ అది నాటౌట్ అని ప్రకటించారు. దీంతో అంపైర్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు కానీ, బ్యాటర్లు తీసిన ఆ ఒక్క పరుగును మాత్రం స్కోరు బోర్డులో చేర్చలేదు. ఎంసీసీ క్రికెట్ చట్టాల ప్రకారం అంపైర్ అవుట్ అని ప్రకటించగానే ఆ బంతి 'డెడ్ బాల్' గా మారుతుంది. ఎంసీసీ లా 20.1.1.3 ప్రకారం, ఒక బ్యాటర్ అవుట్ అయిన వెంటనే ఆ బంతి డెడ్ అయినట్లు పరిగణిస్తారు. అవుట్ కావడానికి కారణమైన సంఘటన జరిగిన క్షణం నుండే ఆ బంతి ప్లేలో లేనట్లు లెక్క. లా 20.6 ప్రకారం, ఒకవేళ తర్వాత థర్డ్ అంపైర్ ఆ నిర్ణయాన్ని తప్పు అని తేల్చినా, అప్పటికే డెడ్ అయిన ఆ బంతిని మళ్ళీ ప్లేలోకి తీసుకురాలేరు. అంటే, అంపైర్ పొరపాటున అవుట్ ఇచ్చినా సరే, ఆ బంతిపై బ్యాటర్లు సాధించిన పరుగులు లెక్కలోకి రావు. ఒకవేళ అది బౌండరీ వెళ్లినా కూడా దానిని రద్దు చేస్తారు.ఢిల్లీ కేవలం ఒక్క పరుగు తేడాతో ఓడిపోవడంతో ఈ రూల్ పై నెటిజన్లు మండిపడుతున్నారు. అంపైర్ చేసిన తప్పుకు ఢిల్లీ జట్టు భారీ మూల్యం చెల్లించుకుందని విమర్శిస్తున్నారు. అంపైర్లు తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే వాటికి శిక్ష జట్లు ఎందుకు అనుభవించాలని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. ఆధునిక క్రికెట్‌లో టెక్నాలజీ ఇంతగా అందుబాటులో ఉన్నా కూడా, ఇలాంటి నిబంధనల వల్ల మ్యాచ్ ఫలితాలు మారిపోవడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. ఒక్క పరుగుతో మ్యాచ్ ఓడిపోయిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆ డెడ్ బాల్ రూల్ ఒక పీడకలలా మిగిలిపోయింది. ఈ విషయంలో ఐసీసీ పునరాలోచించాలని క్రికెట్ ప్రేమికులు కోరుతున్నారు.






## ముకుల్ చౌదరిపై గవాస్కర్ ప్రశంసల వర్షం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ సాధించిన ఉత్కంఠభరిత విజయం తర్వాత భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ యువ బ్యాటర్ ముకుల్ చౌదరిపై ప్రశంసల వర్షం కురిపించారు. ముకుల్ చౌదరి కేవలం 27 బంతుల్లోనే 7 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 54 పరుగులు చేసి అజేయంగా నిలిచిన తీరును సునీల్ గవాస్కర్ కొనియాడారు. "ప్రతిరోజూ ఐపీఎల్‌లో ఓ కొత్త మెరుపును చూస్తున్నాం. ముకుల్ వంటి యువ ఆటగాడు ఏ మాత్రం భయం లేకుండా, ఒత్తిడిలో తన జట్టును గెలిపించడం అద్భుతం. రాజస్థాన్ తరపున దేశవాళీ క్రికెట్లో 5వ స్థానంలో బ్యాటింగ్ చేసే ఈ కుర్రాడు.. ఐపీఎల్‌లోకి వచ్చి రాత్రికి రాత్రే అందరూ తన గురించి మాట్లాడుకునేలా చేసుకున్నాడు" అని సునీల్ గవాస్కర్ ప్రశంసించారు.ముకుల్ చౌదరి బ్యాటింగ్‌లో ఉన్న ఆత్మవిశ్వాసాన్ని సునీల్ గవాస్కర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రీజులోకి వచ్చిన తర్వాత ముకుల్ చౌదరి కాసేపు సమయం తీసుకుని.. సెట్ అయిన తర్వాత బాల్స్‌ను స్టేడియం బయటకు పంపడం మెచ్చుకోదగ్గ విషయమని పేర్కొన్నారు. ముఖ్యంగా ముకుల్ చౌదరి ఆడిన హెలికాప్టర్ షాట్ చూస్తుంటే ఎంఎస్ ధోనీ పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయని గవాస్కర్ అన్నారు. తనకు షాట్లు కొట్టగలననే నమ్మకం ఉండబట్టే ముకుల్ చౌదరి సింగిల్స్ తీయడానికి నిరాకరించి జట్టును గెలిపించాడని పేర్కొన్నారు.లక్నో జట్టుకు ఈ విజయం చాలా కీలకమని సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. మిచెల్ మార్ష్, ఎయిడెన్ మార్క్రమ్, రిషబ్ పంత్, నికోలస్ పూరన్ వంటి ప్రధాన బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించకపోయినా.. యువ ఆటగాళ్ల అండతో లక్నో గట్టెక్కిందని చెప్పారు. గత సీజన్లో కేవలం స్టార్ ప్లేయర్లపైనే ఆధారపడిన లక్నో.. ఈ సారి వారు విఫలమైనా గెలవగలిగే సత్తా చాటుకోవడం ఆ జట్టుకు సానుకూల అంశమని సునీల్ గవాస్కర్ విశ్లేషించారు.లక్నో విజయం సాధించినప్పటికీ.. నికోలస్ పూరన్ ఆటతీరుపై సునీల్ గవాస్కర్ మండిపడ్డారు. "పూరన్ ఫామ్ లక్నోకు ఆందోళన కలిగించే విషయం. కేకేఆర్ మ్యాచ్‌లో అతను బంతిని సరిగ్గా హిట్ చేయలేకపోయాడు. ప్రతి బంతిని బాదాలనే ప్రయత్నంలో నికోలస్ పూరన్ అవుట్ ఆఫ్ టచ్‌గా కనిపించాడు. మనం చూసిన విధ్వంసకర పూరన్ ఇతను కాదు. లక్నో జట్టు యాజమాన్యం పూరన్‌లో తిరిగి ఆత్మవిశ్వాసం నింపే మార్గాన్ని వెతకాలి" అని సునీల్ గవాస్కర్ సూచించారు.మొత్తానికి ముకుల్ చౌదరి రూపంలో ఐపీఎల్ 2026 ఓ కొత్త ఫినిషర్‌ను కనుగొందని సునీల్ గవాస్కర్ పేర్కొన్నారు. ఈ యువ ఆటగాడి పోరాట పటిమ చూస్తుంటే భవిష్యత్తులో ముకుల్ చౌదరి లక్నో జట్టుకు వెన్నెముకగా మారే అవకాశం ఉందని ముకుల్ చౌదరి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ మ్యాచ్ రిపోర్ట్, గవాస్కర్ చేసిన కామెంట్స్ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# వైభవ్ సూర్యవంశీ విధ్వంసం

## రాజస్థాన్ రాయల్స్ విజయం

**బలగం టీవీ, గువాహటి**

గువాహటిలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మెరుపు ఇన్నింగ్స్‌తో రాజస్థాన్ రాయల్స్ అద్భుత విజయం సాధించింది. డిఫెండింగ్ చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరును 6 వికెట్ల తేడాతో ఓడించిన రాజస్థాన్ ఈ సీజన్‌లో వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసి అగ్రస్థానాన్ని బలోపేతం చేసుకుంది.

మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన రాజస్థాన్ 18 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేధించింది.




**వైభవ్ వండర్ షోలిలి**

రాజస్థాన్ విజయంలో వైభవ్ సూర్యవంశీ (26 బంతుల్లో 78; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) కీలక పాత్ర పోషించాడు. క్రీజులోకి దిగినప్పటి నుంచే బౌలర్లపై దాడి ప్రారంభించిన అతడు పవర్‌ప్లేలోనే మ్యాచ్‌ను రాజస్థాన్ వైపు తిప్పేశాడు. జోష్ హాజిల్‌వుడ్, భువనేశ్వర్, అభినందన్ వంటి బౌలర్లను లక్ష్యంగా చేసుకుని వరుస బౌండరీలు, సిక్స్‌లతో చెలరేగాడు. కేవలం 15 బంతుల్లోనే అర్ధశతకం సాధించి ప్రేక్షకులను అలరించాడు. అతడికి తోడు ధ్రువ్ జురెల్ (43 బంతుల్లో 81 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) నిలకడగా ఆడుతూ జట్టును విజయానికి చేర్చాడు. వీరిద్దరి మధ్య 108 పరుగుల భాగస్వామ్యం మ్యాచ్‌ను పూర్తిగా రాజస్థాన్ వైపు మలిచింది. చివర్లో రవీంద్ర జడేజా (24 ) అండతో జురెల్ జట్టు విజయం ఖాయం చేశాడు.

**రజత్ కెప్టెన్ ఇన్నింగ్స్**

వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌లో బెంగళూరు జట్టు ఆరంభంలోనే వికెట్లు కోల్పోయింది. ఆర్చర్ దాడికి సాల్ట్, పడిక్కల్ త్వరగా పెవిలియన్ చేరారు.

విరాట్ కోహ్లి (16 బంతుల్లో 32; 7 ఫోర్లు) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు నిలవలేకపోయాడు. మధ్యలో కృనాల్, జితేశ్, డేవిడ్ తక్కువ స్కోర్లకే ఔట్ కావడంతో జట్టు కష్టాల్లో పడింది. ఈ సమయంలో రజత్ పాటిదార్ (40 బంతుల్లో 63; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. షెఫర్డ్, వెంకటేశ్ అయ్యర్ సహకారంతో చివరి ఓవర్లలో వేగంగా పరుగులు జోడించి పోరాటపూరిత స్కోరు అందించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

బెంగళూరు: 20 ఓవర్లలో 201/8
(రజత్ 63, కోహ్లి 32; బిష్ణోయ్ 2/32, ఆర్చర్ 2/33)

రాజస్థాన్: 18 ఓవర్లలో 202/4
(జురెల్ 81లి, వైభవ్ 78; కృనాల్ 2/30, హాజిల్‌వుడ్ 2/44)

# 'ధోనినే నా రోల్ మోడల్'..




**ముకుల్ చౌదరి కీలక వ్యాఖ్యలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ అంటేనే అనామక ఆటగాళ్లను రాత్రికి రాత్రే స్టార్లుగా మార్చే వేదిక. 2026 సీజన్‌లో అటువంటి ఒక అద్భుత సంచలనం నమోదైంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో కేకేఆర్ బౌలర్లను ఉతికి ఆరేసిన ముకుల్ చౌదరి ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ అయ్యాడు. కేవలం 27 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీతో లక్నో సూపర్ జెయింట్స్ కి అద్భుత విజయాన్ని అందించిన ఈ కుర్రాడి వెనుక ఒక స్ఫూర్తిదాయకమైన కథ ఉంది. ముకుల్ చౌదరి రాజస్థాన్‌లోని ఒక సాధారణ సైనిక కుటుంబం నుండి వచ్చాడు. అతని తండ్రి భారత సైన్యంలో జవాన్‌గా దేశ సేవ చేశారు. "పోరాటం నా రక్తంలోనే ఉంది" అని ముకుల్ గర్వంగా చెబుతుంటాడు. చిన్నప్పటి నుండి క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో పెరిగిన ముకుల్, తన తండ్రి నుండి మొండి పట్టుదలను నేర్చుకున్నాడు. మైదానంలో ఎంతటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా లొంగిపోకుండా పోరాడే గుణం అతనికి తన తండ్రి వల్లే వచ్చిందని మ్యాచ్ అనంతరం ముకుల్ భావోద్వేగంతో వెల్లడించాడు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ముకుల్ క్రీజులోకి వచ్చాడు. సునీల్ నరైన్, మిచెల్ స్టార్క్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను ఎదుర్కోవడం ఏమాత్రం సులభం కాదు. కానీ ముకుల్ ఏమాత్రం బెదరకుండా తన బ్యాట్‌కు పనిచెప్పాడు. మైదానం నలుమూలలా సిక్సర్ల వర్షం కురిపించాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో అతను ఆడిన తీరు చూస్తుంటే ఒక అనుభవం ఉన్న ఫినిషర్ ఆడుతున్నట్లుగా అనిపించింది. ముకుల్ చౌదరి ఎంఎస్ ధోనీకి వీరాభిమాని. "నేను చిన్నప్పటి నుండి ధోనీ భాయ్‌ని చూస్తూ పెరిగాను. మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లి ఎలా ముగించాలో ఆయనను చూసే నేర్చుకున్నాను. నా బ్యాటింగ్ స్టైల్‌లో కూడా ఆయన ప్రభావం ఉంటుంది" అని ముకుల్ పేర్కొన్నాడు. లక్నో జట్టు డైరెక్టర్ టామ్ మూడీ కూడా ముకుల్ బ్యాటింగ్‌ను మెచ్చుకుంటూ.. అతను జట్టుకు దొరికిన అసలైన ఆణిముత్యం అని కొనియాడారు. ముకుల్ ప్రయాణం అంత సులభంగా సాగలేదు. రాజస్థాన్ దేశవాళీ క్రికెట్‌లో నిలదొక్కుకోవడానికి అతను ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. కనీసం బ్యాట్ కొనుక్కోవడానికి కూడా ఇబ్బంది పడిన రోజులు ఉన్నాయని అతను గుర్తు చేసుకున్నాడు. అయితే తన ప్రతిభను గుర్తించిన లక్నో స్కౌట్స్, అతనికి ట్రయల్స్‌లో అవకాశం ఇచ్చారు. అక్కడ తన పవర్‌ఫుల్ హిట్టింగ్‌తో మెప్పించిన ముకుల్, ఇప్పుడు ఐపీఎల్ వేదికపై తన సత్తా చాటుతున్నాడు. ఒక్క ఇన్నింగ్స్‌తో ముకుల్ చౌదరి పేరు ఇప్పుడు సోషల్ మీడియాలో మారుమోగిపోతోంది. రిషభ్ పంత్ నేతృత్వంలోని లక్నో జట్టుకు ఇతను ఒక ప్రధాన అస్త్రంగా మారాడు. తన తండ్రి సరిహద్దులో దేశాన్ని రక్షిస్తే, తాను మైదానంలో పరుగుల వర్షం కురిపించి తండ్రి పేరు నిలబెడుతున్నానని ముకుల్ చెప్పిన మాటలు అభిమానుల హృదయాలను గెలుచుకుంటున్నాయి. మరిన్ని మ్యాచుల్లో ముకుల్ ఇలాగే రాణించి భారత జట్టులోకి రావాలని ఆశిద్దాం.

## తమ్ముడికి హ్యాండిచ్చిన సారా టెండూల్కర్..

**బలగం టీవీ, హైదరాబాద్**






భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయ సారా టెండూల్కర్ లక్నోలో సందడి చేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య ఆదివారం జరిగే మ్యాచ్ కోసం ఆమె లక్నోకు వచ్చినట్లు తెలుస్తోంది. లక్నో ఎయిర్‌పోర్ట్‌లో సారా టెండూల్కర్‌ను చూసిన మీడియా ప్రతినిధులు.. ఎవరికి సపోర్ట్ చేస్తారంటూ ఆమెను ప్రశ్నించారు. గుజరాత్ టైటాన్స్ జట్టుకా..? లేక తన తమ్ముడు అర్జున్ టెండూల్కర్ ప్రాతినిధ్యం వహిస్తున్న లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు మద్దతు తెలుపుతారా? అని ప్రశ్నించారు. సారా టెండూల్కర్ మాత్రం సమాధానం చెప్పకుండా చిరునవ్వుతో వారికి దూరంగా వెళ్లిపోయింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తున్నారు. తన ప్రియుడు శుభ్‌మన్ గిల్ కోసమే సారా టెండూల్కర్ లక్నోకు వచ్చిందని, గుజరాత్ టైటాన్స్‌కే మద్దతు తెలుపుతుందని కామెంట్ చేస్తున్నారు. తమ్ముడు జట్టు అయిన లక్నో సూపర్ జెయింట్స్‌కు సపోర్ట్ చేసేందుకు అతను ఏమైనా తుది జట్టులో ఆడుతాడా? అని ప్రశ్నిస్తున్నారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని గుజరాత్ టైటాన్స్‌కు మద్దతు తెలిపేందుకే సారా లక్నోకు వచ్చిందని, లేకుంటే తన తమ్ముడు ప్రాతినిధ్యం వహిస్తున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు మద్దతు తెలుపుతానని మీడియాకు తెలిపేదని ఫ్యాన్స్ అంటున్నారు. ఏది ఏమైనా సొంత తమ్ముడికి సారా టెండూల్కర్ షాకిచ్చిందని, తమ్ముడు అర్జున్ టెండూల్కర్ కంటే ప్రియుడు శుభ్‌మన్ గిల్ ఎక్కువయ్యాడని కామెంట్ చేస్తున్నారు. సారా టెండూల్కర్, శుభ్‌మన్ గిల్ పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఇద్దరూ తమ ప్రేమ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ వార్తలను కూడా ఖండించలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో అర్జున్ టెండూల్కర్ లక్నో సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన లక్నో ఆదివారం సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. శుక్రవారం సారా టెండూల్కర్ లక్నో ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో ఈ మ్యాచ్ కోసమే సారా వచ్చిందని అంతా అనుకుంటున్నారు. కానీ ఆమె రాకపై ఎలాంటి క్లారిటీ లేదు. బహుషా అర్జున్ సతీమణి, తన మరదలుకు తోడుగా వచ్చి ఉంటుందని, అనవసర పుకార్లు పుట్టించవద్దని సచిన్ ఫ్యాన్స్ కోరుతున్నారు.






## వరుస ఓటములతో కేకేఆర్, చెన్నై సూపర్ కింగ్స్

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో రెండు బలమైన జట్లు అయిన కేకేఆర్, చెన్నై సూపర్ కింగ్స్ వరుస ఓటములతో సతమతమవుతున్నాయి. కోల్‌కతా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటిలో ఓడిపోగా, ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో కేవలం ఒక పాయింట్‌తో తొమ్మిదో స్థానంలో ఉంది. జట్టు ప్రదర్శన అభిమానులను నిరాశపరుస్తున్నప్పటికీ, రాబోయే మ్యాచ్‌ల్లో పుంజుకుంటే అద్భుతాలు చేసే అవకాశం ఉంది.ఇటీవల లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో జరిగిన పోరులో కోల్‌కతా విజయం అంచు వరకు వెళ్లి బోల్తా పడింది. గెలిచే స్థితిలో ఉన్న మ్యాచ్‌ను ముకుల్ చౌదరి అద్భుత ప్రదర్శనతో కేకేఆర్ చేతుల నుంచి లాగేసుకున్నాడు. ఈ మూడు వికెట్ల తేడాతో వచ్చిన ఓటమి ఆ జట్టు ప్లేఆఫ్ అవకాశాలను మరింత సంక్లిష్టంగా మార్చింది. ప్రస్తుతం కోల్ కతా జట్టు ఖాతాలో 10 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి.ఈ టోర్నీలో మొత్తం 10 జట్లు పాల్గొంటున్నాయి. ఒక్కో జట్టు 14 మ్యాచ్‌లు ఆడాలి. కోల్‌కతా ప్లేఆఫ్స్ బెర్తు దక్కించుకోవాలంటే మిగిలిన 10 మ్యాచ్‌ల్లో కనీసం 8 మ్యాచ్‌లలో ఖచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. దీనివల్ల ఆ జట్టు ఖాతాలో 17 పాయింట్లు చేరుతాయి. సాధారణంగా 16 నుంచి 18 పాయింట్లు సాధించిన జట్టుకు నాకౌట్ దశకు వెళ్లే అవకాశం మెండుగా ఉంటుంది. విజయాలతో పాటు నెట్ రన్ రేట్ మెరుగుపరుచుకోవడం కూడా ఇక్కడ కీలకం కానుంది.వరుస ఓటముల నుంచి కోలుకోవడానికి కోల్‌కతాకు ఏప్రిల్ 14న జరిగే మ్యాచ్ ఎంతో కీలకం. పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న చెన్నై సూపర్ కింగ్స్‌తో ఈ మ్యాచ్ జరగనుంది. రెండు జట్లూ విజయాల కోసం ఆకలితో ఉండటంతో ఈ పోరు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల ఖాతాను తెరిస్తేనే కోల్‌కతా తన ఆశలను సజీవంగా ఉంచుకోగలదు. అంతకంటే ముందు ఏప్రిల్ 11న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనున్న చెన్నై జట్టు కూడా గెలుపుపై కన్నేసింది.

## మైదానంలో కారుతో వైభవ్ సూర్యవంశీ సందడి..

ఐపీఎల్ 2026 సీజన్ కేవలం ఫోర్లు, సిక్సర్లతోనే కాదు.. మైదానం బయట ఆటగాళ్లు చేసే అల్లరితోనూ ఫ్యాన్స్‌ను విపరీతంగా అలరిస్తోంది. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్ శిబిరంలో నవ్వుల పువ్వులు పూయిస్తున్న కొన్ని సరదా సంఘటనలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అటు కుర్రాడు వైభవ్ సూర్యవంశీ రిమోట్ కారు ఆటలు, ఇటు అశ్విన్ వేసిన సెటైర్లు నెటిజన్లను కడుపుబ్బ నవ్విస్తున్నాయి. ఐపీఎల్ 2026 ప్రాక్టీస్ సెషన్లలో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే ఈసారి అతను బ్యాట్‌తో కాదు, ఒక రిమోట్ కారుతో వార్తల్లో నిలిచాడు. గ్రౌండ్‌లో రిమోట్ కారును నడుపుతూ వైభవ్ ఎంజాయ్ చేస్తున్న వీడియోను టీమ్ సిబ్బంది రికార్డ్ చేశారు. ఆ సమయంలో రాయల్స్ సపోర్ట్ స్టాఫ్ ఒకరు జోక్ చేస్తూ.. "అబ్బాయికి ఇంకా డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదు, కారు నడుపుతున్నాడు" అని అనడం వీడియోలో వినిపించింది. ఈ సరదా సంభాషణ ఇప్పుడు సోషల్ మీడియాలో మీమ్స్ రూపంలో విపరీతంగా తిరుగుతోంది. తీవ్రమైన ప్రాక్టీస్ మధ్య ఇలాంటి చిన్న చిన్న సరదాలు టీమ్ వాతావరణాన్ని ఉల్లాసంగా ఉంచుతాయని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. మరోవైపు, ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. గౌహతి వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో వారిద్దరి బ్యాటింగ్ చూసి కామెంట్రీ బాక్స్‌లో ఉన్న లెజెండరీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ (భజ్జీ) అప్రయత్నంగా లేచి నిలబడి సెల్యూట్ కొట్టారు. దీనిపై మన తెలివైన స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తనదైన శైలిలో స్పందించాడు. ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేస్తూ.. "నా వైపు నుంచి కూడా సెల్యూట్. కానీ మా మిత్రుడు పుజారా మాత్రం సరిగ్గా సెల్యూట్ చేయలేదు" అంటూ చెతేశ్వర్ పుజారాను ట్యాగ్ చేసి ఆటపట్టించాడు. అశ్విన్ చేసిన ఈ పోస్ట్ నెటిజన్లను కడుపుబ్బ నవ్విస్తోంది. మైదానంలో ప్రత్యర్థులకు చుక్కలు చూపే అశ్విన్, బయట తన తోటి ఆటగాళ్లతో ఎంత సరదాగా ఉంటాడో ఈ సంఘటన మరోసారి నిరూపించింది. రాజస్థాన్ రాయల్స్ జట్టు ఈ సీజన్‌లో అటు విజయాలతో పాటు ఇటు సోషల్ మీడియాలో కూడా టాప్ గేర్‌లో దూసుకుపోతోంది. సీనియర్ ఆటగాళ్లు, జూనియర్ల మధ్య ఉన్న ఈ సమన్వయం మరియు స్నేహం జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. డిజిటల్ యుగంలో క్రికెట్ అంటే కేవలం ఆట మాత్రమే కాదు, ఇలాంటి హ్యూమర్ కూడా ఒక భాగమైపోయింది.

# ధురందర్ 2' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్..!



## ఫ్యాన్స్ కు నిజంగా గుడ్ న్యూస్..!


బాలీవుడ్ స్టార్ హీరో రణ్ వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆధిత్య దర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురందర్ 2' మూవీ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల హవా సృష్టిస్తోంది. మార్చి 19న రిలీజైన ఈ మూవీ ఇప్పటివరకూ రూ. 1600 కోట్లకుపైగా భారీ వసూళ్లు రాబట్టి రూ. 2000 కోట్ల క్లబ్ లో చేరేందుకు సిద్ధం అవుతోంది. ఇప్పటికే పుష్ప-2 రికార్డున్ని చెరిపేసిన ఈ మూవీ త్వరలోనే బాహుబలి 2, దంగల్ మూవీ రికార్డుల్ని దాటి భారత్ లోనే అత్యధిక కలెక్షన్లు సృష్టించిన సినిమాగా మారనుంది. ఇక ఈ మూవీ ఓటీటీ రిలీజ్ పై ప్రస్తుతం చర్చ నడుస్తోంది.సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాలు.. ధియేటర్లలో ఫుల్ రన్ తర్వాత అంటే దాదాపు 8 వారాల విండో తర్వాతే ఓటీటీ ప్లాట్ ఫార్మ్ లోకి వస్తుంటాయి. అయితే ప్రస్తుతం ధురంధర్-2 మూవీ బాక్సాఫీస్ వద్ద రచ్చ రచ్చ చేస్తోంది. విడుదలై ఇన్ని రోజులైనా హౌజ్ ఫుల్ షోలతో కంటిన్యూ అవుతోంది. దాంతో ఈ మూవీని ఇప్పుడిప్పుడే ఓటీటీకి తీసుకురావడానికి మేకర్స్ తొందరపడటంలేదని తెలుస్తోంది.ఇక ధురంధర్-2 సినిమా డిజిటల్ రైట్స్ ప్రస్తుతం జియోహాట్ స్టార్ వద్ద ఉన్నాయి. అలాగే ప్రస్తుతం దేశంలో ఐపీఎల్ హవా నడుస్తోంది. ఈ సమయంలో రిలీజ్ చేస్తే పోటీ ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. అందుకే ఐపీఎల్ లీగ్ 2026 ముగిసిన తర్వాతే ధురంధర్-2 సినిమాను ప్రేక్షకుల కోసం ఓటీటీలోకి రిలీజ్ చేయడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. అంటే ఈ లెక్కన ఈ మూవీ మే చివరివారం లేదా జూన్ మొదటి వారంలో రిలీజ్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ధురంధర్-2 సినిమాలో రణ్ వీర్ సింగ్ తో పాటుగా అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, మాధవన్ తమ పాత్రలను అద్భుతంగా పండించారు. ధురంధర్-1 మూవీ 2025లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచిన విషయం తెలిసందే. ఇక రెండో భాగం అంతకు మించి విజయం సాధించింది. అలా రణ్ వీర్ సింగ్ స్టార్ హోదాను మరో స్థాయికి తీసుకు వెళ్లిన సినిమాగా ధురంధర్-2 నిలిచింది.

# రూ.900 కోట్ల భారీ బడ్జెట్‌తో 'రాకా'




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్-స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రాకా' సినిమా ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ఈ చిత్రానికి సంబంధించిన భారీ పారితోషికాలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి.ఈ సినిమా బడ్జెట్ దాదాపు రూ.800 నుంచి 900 కోట్ల వరకు ఉంటుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రానికి సంబంధించిన పారితోషికాలు కూడా ఇప్పుడు పెద్ద చర్చగా మారాయి. హీరో అల్లు అర్జున్ ఈ ప్రాజెక్ట్ కోసం రూ.175 కోట్ల రెమ్యునరేషన్‌తో పాటు లాభాల్లో 15 శాతం వాటాను తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా విజయవంతమైతే ఆయన మొత్తం సంపాదన రూ.300 కోట్లకు పైగా వెళ్లే అవకాశముందని విశ్లేషణలు చెబుతున్నాయి.ఇక దర్శకుడు అట్లీ కూడా తన స్థాయికి తగ్గట్టుగా భారీ పారితోషికం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి బ్లాక్‌బస్టర్ విజయానంతరం ఆయన ఈ సినిమాకు దాదాపు రూ.100 కోట్ల వరకు డిమాండ్ చేసినట్లు టాక్. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. ఆమెకు రూ.20 నుంచి 25 కోట్ల వరకు పారితోషికం అందుతున్నట్లు తెలుస్తోంది. అలాగే నేషనల్ క్రష్‌గా గుర్తింపు పొందిన రష్మిక మందన్న ఈ సినిమాలో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుండటం విశేషం. ఈ పాత్ర కోసం ఆమెకు రూ.5 నుంచి 7 కోట్ల వరకు పారితోషికం అందుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.భారీ తారాగణం, హై టెక్నికల్ వాల్యూస్, అట్లీ స్టైల్ మాస్ ఎలిమెంట్స్ అన్నీ కలిపి 'రాకా'ను ఒక విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఫస్ట్ లుక్‌తోనే భారీ అంచనాలు పెంచుకున్న ఈ చిత్రం విడుదలకు ముందే ఇండస్ట్రీలో రికార్డుల చర్చ మొదలైంది. విడుదలైన తర్వాత బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా చూస్తే, అల్లు అర్జున్ -- అట్లీ కాంబోలో రాబోతున్న 'రాకా' సినిమా భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలవబోతోందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. టాలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య రూపొందుతున్న తాజా చిత్రం రాకా అల్లు అర్జున్ హీరోగా, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. అల్లు అర్జున్ 44వ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది.

# ఏకే 64 కోసం అజిత్ కుమార్ అదిరిపోయే ప్లాన్..



ఏకే 64 కోలీవుడ్ స్టార్ యాక్టర్ అజిత్‌కుమార్ మార్క్ ఆంటోనీ ఫేం అధిక్ రవిచంద్రన్‌తో సినిమాను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. ఏకే 64గా రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. ఈ మూవీని అజిత్ కుమార్ నిర్మించాలని ప్లాన్ చేస్తున్నాడట. మరో ప్రొడక్షన్స్ హౌస్ ఫండింగ్ ద్వారా అజిత్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్.తనకు, నిర్మాతలకు మధ్య రెమ్యునరేషన్ విషయంలో విభేదాలు రావడంతో అజిత్ కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఓ వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. అంతేకాదు ఈ మూవీ షూటింగ్ మే మొదటి వారంలో షురూ కానుందట. అజిత్ కుమార్‌కు రేసింగ్ అంటే ఎంత ప్రాణమో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రొఫెషనల్‌గా యాక్టింగ్‌కు ఇబ్బంది కాకుండా చూసుకుంటూనే మరోవైపు తనకిష్టమైన రేసింగ్‌పై కూడా ఫోకస్ పెట్టేలా ప్లాన్ చేసుకున్నాడని టాక్.తాజా టాక్ ప్రకారం అజిత్ కుమార్ ఒకేసారి ఇటు సినిమా, అటు రేసింగ్‌పై దృష్టిపెట్టబోతున్నాడు. అంటే నెలలో 15 రోజులు షూటింగ్ కోసం, మరో 15 రోజులు రేసింగ్ కోసం కేటాయించనున్నాడట. ఇదే నిజమైతే తనను ఎంతో ఇష్టపడే అభిమానులకు ఇటు రేసింగ్‌ను,అటు సినిమాలను మిస్ కాకుండా డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్నాడన్నమాట.

# లెజెండరీ రోల్ లో ధురంధర్ బ్యూటీ..



## సెట్ అయితే పీక్స్ ఖాయం..!

'ధురంధర్' సినిమాతో సెన్సేషనల్ ఎంట్రీ ఇచ్చిన యంగ్ బ్యూటీ సారా అర్జున్, ఇప్పుడు ఇండియన్ సినిమా చరిత్రలోనే అత్యంత సవాల్‌తో కూడిన పాత్రకు సిద్ధమవుతోంది. లెజెండరీ నటి, వెండితెర అందాల దేవత మధుబాల బయోపిక్‌లో సారా టైటిల్ రోల్ పోషించనున్నట్లు సమాచారం. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో, జస్మీత్ కె రీన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంపై అప్పుడే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.నిజానికి ఈ ఐకానిక్ పాత్ర కోసం మేకర్స్ మొదట కియారా అద్వానీ, సాయి పల్లవి వంటి స్టార్స్‌ను పరిశీలించారు. కానీ, 'ధురంధర్' చిత్రంలో సారా అర్జున్ పెర్ఫార్మెన్స్ చూసిన తర్వాత,ఈ పాత్రకుఆమెనే సరైన ఎంపికని చిత్ర బృందం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మధుబాల జీవితంలోని అంతుచిక్కని రహస్యాలు, ఆమె సినీ ప్రస్థానం మరియు వ్యక్తిగత ఎమోషన్స్ ఈ చిత్రం ద్వారా పాన్-ఇండియా స్థాయిలో ఆవిష్కరించనున్నారు.మధు బాల లాంటి గ్రేస్,అందం, నటనను ప్రతిబింబించడం సారా అర్జున్‌కు అంత సులభమైన విషయం కాదు.ఇదిఆమె కెరీర్‌ను మలుపు తిప్పే అద్భుతమైన అవకాశం అయినప్పటికీ, ఆమె నటనకు ఇది అసలైన పరీక్ష అని చెప్పాలి. ఒక లెజెండరీ స్టార్‌గా సారా ఎంతవరకు మెప్పి స్తుందో అన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని కలిగిస్తోంది. ఒకవేళ ఈ సినిమా గనుక సక్సెస్ అయితే, సారా అర్జున్ ఇండియన్ సినిమాలో మోస్ట్ ప్రామిసింగ్ స్టార్‌గా ఎదగడం ఖాయం.

# ఆ కామెంట్స్ తో వివాదంలో ఇరుక్కున్న శ్రీలీల..?

యంగ్ బ్యూటీ శ్రీలీల చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ముంబయి భామ ఆయేషా ఖాన్ తాను పీరియడ్స్ సమయంలో ఐటెం సాంగ్ చేశానని చెప్పిన దానికి కౌంటర్‌గా శ్రీలీల స్పందించినట్లు కనిపిస్తోంది. సినిమాల్లో నటించే మహిళలకు పీరియడ్స్ అనేది ఒక సాకు కాదని, తాను కూడా ఎన్నో సార్లు ఆ ఇబ్బందుల్లోనే డ్యాన్స్ చేశానని ఆమె పేర్కొంది.అయితే, ఒక డాక్టర్ అయ్యుండి, ఒక మహిళగా పీరియడ్స్ సమయంలో ఉండే శారీరక ఇబ్బందులను "సాకు" గా అభివర్ణించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ప్రతి మహిళ శరీరం ఒకేలా స్పందించదని, అలాంటి సమయంలో విశ్రాంతి తీసుకోవడం తప్పు కాదని నెటిజన్లు అభి ప్రాయ పడుతున్నారు. వివాదాలకు దూరంగా ఉండే శ్రీలీల తొలిసారి ఇలాంటి కామెంట్స్‌తో వార్త ల్లో నిలవడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

# 'స్పిరిట్' కోసం తన వంతు సిద్ధమంటున్న ధురంధర్ దర్శకుడు!

ఇప్పుడు పాన్ ఇండియా వైడ్‌గా ఓ రేంజ్ లో వినిపిస్తున్న యంగ్ అండ్ స్టార్ దర్శకుల పేర్లలో టాలీవుడ్ నుంచి సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నుంచి తాజాగా ఆదిత్య ధర్ లు కూడా ఉన్నారు. ఇక ఆదిత్య రీసెంట్ గా ఇచ్చిన బ్యాక్ టు బ్యాక్ బ్యాంగర్ హిట్స్ ధురంధర్ తో సందీప్ రెడ్డి వంగ తనని ఆకాశానికి ఎత్తేసాడు. మొదట ఓసారి మళ్లీ ఇప్పుడు కూడా మరింత మాస్ గా చెప్పడంతో ఆదిత్య ధర్ ఆనందం వ్యక్తం చేస్తూ సందీప్ కి రిప్లై ఇవ్వడం జరిగింది.మేరే ప్యారే సందీప్ అంటూ మీరు నిలబడే తీరు మీ నిజాయితీకి నేనెప్పుడూ గౌరవం ఇస్తాను. ఎలాంటి బెరుకు లేకుండా మీరు సినిమా కోసం ఎలా నిలబడతారో నేనెప్పుడూ గమనిస్తూనేఉంటాను.లెజెండ్ ప్రభాస్‌కి నా ప్రేమను అందజేయండి.. మీ స్పిరిట్ కోసం చాలా ఎదురు చూస్తున్నాను. ఆ సినిమాకి ఆల్ ది బెస్ట్ అంటూ అలాగే నా వంతుగా మీకేమయినా సహాయం కావాలి అంటే తప్పకుండా మీకోసం జెన్యూన్ గా సహకారాన్ని అందిస్తాను అని చెప్పడం ఇందులో మరో హైలైట్ గా నిలిచింది. దీనితో ఈ క్రేజీ కలయిక విషయంలో అభిమానులు మరింత ఎగ్జైట్ అవుతున్నారు.



# బాలయ్య గెటప్‌లో అదరగొట్టిన కిరణ్ అబ్బవరం..

## ఆ పాత టీవీ వెనుక ఉన్న అసలు కథ ఏంటంటే?



యువ హీరో కిరణ్ అబ్బవరం మరోసారి నిర్మాతగా మారి కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ నిర్మిస్తున్న సినిమా 'తిమ్మరాజుపల్లి టీవీ'. స్వచ్ఛమైన పల్లెటూరి వాతావరణం, పాత రోజుల నాస్టాల్జియా నేపథ్యంగా తెరకెక్కిన ఈ పీరియాడిక్ డ్రామా ట్రైలర్‌ను విక్టరీ వెంకటేష్ చేతుల మీదుగా లాంచ్ చేశారు. హైదరాబాద్‌లో చాలా గ్రాండ్‌గా జరిగిన ఈ ట్రైలర్ రిలీజ్ వేడుక ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ముఖ్యంగా కిరణ్ అబ్బవరం బాలకృష్ణ సూపర్ హిట్ మూవీ 'చెన్నకేశవరెడ్డి' గెటప్‌లో వచ్చి అందరినీ సర్ ప్రైజ్ చేశారు.సుమైర స్టూడియోస్‌తో కలిసి కేఏ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వస్తున్న ఈ చిత్రానికి తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్లుగా టాలీవుడ్‌కు పరిచయం అవుతుండగా.. వి.మునిరాజు దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈ నెల 17న థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంగా జరిగిన ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ట్రైలర్‌ను విడుదల చేసిన వెంకటేష్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిన్నప్పుడు కొత్త సినిమా వస్తే టీవీలు, వీసీడీల్లో చూసి ఎంతలా మురిసిపోయేవాళ్ళమో కిరణ్ గుర్తుచేసుకున్నారు. అప్పటి ఆ సంతోషాన్ని ఇప్పటి జనరేషన్‌కు చూపించాలనే ఉద్దేశ్యంతోనే అప్పటి హీరో, హీరో యిన్ల గెటప్స్‌లో తమ టీమ్ అంతా ఈ వేడుకలో సందడి చేశారని చెప్పారు. తనకు బాలయ్య నరసింహనాయుడు, సమరసింహారెడ్డి, చెన్నకేశ వరెడ్డి లాంటి సినిమాలంటే ఎంతో ఇష్టమని, అందుకే ఈ గెటప్ వేశానని కిరణ్ చెప్పారు. ఈ కలలో భాగమైన వింటేజ్ హీరోలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమా కోసం దాదాపు రెండేళ్ల పాటు టీమ్ ఎంతో కష్టపడిందని, దీన్ని తన సొంత సినిమాలాగానే ప్రమోట్ చేస్తున్నానని కిరణ్ స్పష్టం చేశారు. "మేము కష్టపడ్డాం కాబట్టి సినిమా చూడమని నేను ఎవరినీ అడగను. ఎందుకంటే ప్రేక్షకుల సమయానికి, డబ్బుకు నేను ఎంతో విలువ ఇస్తాను. మా ట్రైలర్, పాటలు, కంటెంట్ చూడండి. మీకు నచ్చితేనే థియేటర్‌కు వెళ్లి సపోర్ట్ చేయండి" అని చాలా క్లారిటీగా మాట్లాడారు.ఈ వేసవికి ఊరికి వెళ్లిన ఫీల్ ఈ సినిమా ఇస్తుందని, ఆర్టిస్టుల పెర్ఫార్మెన్స్, టెక్నికల్ వాల్యూస్ ప్రేక్షకులను మెప్పిస్తాయని ఆయన భరోసా ఇచ్చారు. ముఖ్యంగా యాభై ఏళ్లు దాటిన వారికి, ముప్పై-నలభై ఏళ్ల వయసులో ఉన్నవారికి పాత జ్ఞాపకాలు కచ్చితంగా గుర్తొస్తాయన్నారు. టీవీ కొనేందుకు అప్పట్లో ఎలాంటి కష్టాలు పడ్డారో ఈ సినిమా కళ్లకు కడుతుంద న్నారు. పాతతరం ఎమోషన్స్ అర్థం కావాలంటే యూత్ కూడా ఈ సినిమా చూడాలని కిరణ్ అబ్బవరం సూచించారు.